




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 11 మంగళవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 147
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# మైడియర్ ఫ్రెండ్ ట్రంప్..

- ట్రంప్‌ను కలిసేందుకు యూఎస్‌కు వెళ్తున్నా..
- ఫ్రాన్స్,అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లిన మోదీ
- పారిస్‌లో జరగనున్న ఏఐ సదస్సులో ట్రంప్‌తో మీట్
- వాషింగ్టన్ డీసీ కార్యాలయంలో మోదీకి ఆతిథ్యం



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

భారత ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఫ్రాన్స్, అమెరికా పర్యటనలకు బయలుదేరి వెళ్లారు. ముందుగా ఆయన ఫ్రాన్స్ రాజధాని పారిస్ చేసుకుని అక్కడ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో భేటీ కానున్నారు. అనంతరం ఏఐ సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. వరుసగా మూడోసారి ప్రధాని అయ్యాక ప్రధాని మోడీ.. తొలిసారి అమెరికా, ఫ్రాన్స్ పర్యటనలకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో తాను ఫ్రాన్స్, అమెరికా పర్యటనలకు వెళ్తున్నట్లు ప్రధాని మోడీ ఇవాళ ట్వీట్ చేశారు. ఇందులో ఆయన ముందుగా ఫ్రాన్స్ పర్యటన వివరాలను వెల్లడించారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా తాను అక్కడి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ తో భేటీ అవుతానని, ఇందులో భారత్-ఫ్రాన్స్ సంబంధాల బలోపేతంపై చర్చిస్తానని తెలిపారు. ఆ తర్వాత ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్న ఏఐ సదస్సులో కూడా పాల్గొంటానని ట్రంప్ ట్వీట్ చేశారు. అనంతరం మార్సిలీ వెళ్లి అక్కడ భారత రాయబార కార్యాలయం ప్రారంభిస్తానని మోడీ తెలిపారు. అనంతరం అమెరికా పర్యటన వివరాలను కూడా వెల్లడించారు. ఇందులో వాషింగ్టన్ డీసీలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ భేటీలో ఇరుదేశాల బంధాన్ని బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో సంబంధాలను బలోపేతం చేస్తానని వెల్లడించారు. గతంలో ట్రంప్ తొలిసారి

# లడ్డూ కల్తీగాళ్లు దొరికారు

- లడ్డూ కల్తీ కేసులో కీలకమైన అడుగు
- నలుగురిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు
- న్యాయమూర్తి ముందు హాజరు..20 వరకు రిమాండ్
- జంతువుల కొవ్వు ఉన్నట్లు సిట్ నివేదిక

2



అపూర్వ చావడా | పొమిల్ జైన్ | విపిన్ జైన్ | రాజు రాజశేఖరన్

**తిరుపతి-నవభూమిబ్యూరో**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఫిర్యాదులపై నమోదైన కేసులో కీలక అడుగు పడింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలోని భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్, శ్రీకాళహస్తి సమీపంలోని పెనుబాకలో ఉన్న శ్రీవైష్ణవి డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో అపూర్వ చావడా, తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ ఎండీ డా. రాజు రాజశేఖరన్లను సిట్ అధికారులు ఆదివారం సాయంత్రం తిరుపతిలో అరెస్టు చేశారు. రాత్రి 10.30కు రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి నివాసంలో నిందితులను ప్రవేశపెట్టారు. వారికి ఈ నెల 20 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చా రు. ఈ కేసులో ఇవే తొలి అరెస్టులు. వైకాపా హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఫిర్యాదుపై గతేడాది సెప్టెంబరు 25న తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఏపీ పోలీసు అధికారులతో ఏర్పాటైన సిట్ ఇటీవల దర్యాప్తు ముమ్మరం చేసింది. సీబీఐ హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, ఇతర సభ్యులు.. గత మూడు రోజులుగా వైష్ణవి డెయిరీకి చెందిన డ్రైవర్లు, తితిదే సిబ్బందిని ప్రశ్నించి వివరాలు రాబట్టారు.

**జంతువుల కొవ్వు ఉన్నట్లు నివేదిక**

రూ.319.80కి కిలో చొప్పున 10 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు ఏఆర్ డెయిరీకి వైకాపా హయాంలో టెండరు కట్టబెట్టారు. గతేడాది జూన్ నుంచి ఆ సంస్థ నెయ్యి సరఫరా మొదలు పెట్టింది. జులై 6, 17 తేదీల్లో పంపించిన 4

# చిలుకూరు ప్రధాన అర్చకుడు
# రంగరాజన్‌పై దాడి

- రంగరాజన్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్.. కీలక ఆదేశాలు
- 6గురిని అరెస్టు చేసినట్లు ప్రకటించిన పోలీసులు
- ఆరుగురిలో ఇద్దరు మహిళలు..రిమాండ్‌కు తరలింపు
- ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి స్వస్థలం తూగోజీ జిల్లా
- రంగరాజన్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేత కేటీఆర్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మొయినాబాద్ మండలం చిలుకూరు శ్రీబాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి నేపథ్యంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. రంగరాజన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. ఆ దాడికి సంబంధించిన వివరాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు రంగరాజన్‌ను ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ అగ్రనేతలు పరామర్శించారు. ఈ దాడి ఘటనను బీఆర్ఎస్

### ఆరుగురి అరెస్టు:డీసీపీ

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్పై దాడి ఘటనపై రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు.

# తల్లికి వందనంలో కోత

- బడికి వెళ్లే ప్రతీ విద్యార్థి తల్లి ఖాతాలో రూ 15 వేలు చొప్పున జమ
- అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు
- తాజాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమలు
- లబ్ధిదారుల ఎంపికతో సర్కార్‌పై పడే ఆర్థికభారంపై లెక్కలు
- వైసీపీ హయాంలో అమ్మ ఒడి పథకమే..తల్లీ వందనం

2




**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుపై కసరత్తు ప్రారంభించింది. లబ్దిదారులు.. ఆర్థిక భారంపైన లెక్కలు సిద్ధం చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే బడికి వెళ్లే ప్రతీ విద్యార్థి తల్లి ఖాతాలో రూ 15 వేలు చొప్పున జమ చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తాజాగా ఈ పథకం వచ్చే విద్య సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో, లబ్దిదారులకు ఒక ఏడాది పథకం అమలు కానట్లే. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఈ పథకం అమలుకు సంబంధించిన నిబంధనలను ఖరారు చేసింది. అమలుపై కసరత్తు..వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకానికి కూటమి ప్రభుత్వం తల్లికి వందనంగా పేరు మార్పు చేసింది. వైసీపీ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి పాఠశాలల నిర్వహణ పేరుతో కోత వేసి తొలుత రూ 14 వేలు, ఆ తరువాత రూ 13 వేలు చొప్పున అమలు చేసింది. కూటమి పార్టీల నేతలు తాము అధికారంలోకి వస్తే ఎలాంటి కోతలు లేకుండా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి వారి తల్లుల ఖాతాల్లో రూ 15 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. జూన్‌లో

# బాస్ ఈజ్ బ్యాక్!

- గేరు మార్చిన కేసీఆర్ - ఆపరేషన్ షురూ, బిగ్ టర్న్..!!
- తిరిగి యాక్టివ్ అయ్యేందుకు కేసీఆర్ యత్నం
- భారీ బహిరంగ సభల ద్వారా ప్రజాక్షేత్రంలోకి..
- రెండు సభలు నిర్వహించి,తర్వాత కార్యక్షేత్రంలోకి..
- స్థానిక సంస్థల ఎన్నికలపై కేసీఆర్ నజర్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. సీఎం రేవంత్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పైన ఫోకస్ చేసారు. అటు ఎన్నికల సంఘం ఈ ఎన్నికలపై కసరత్తు చేస్తోంది. ఇటు కేసీఆర్ ఇదే సమయంలో కేసీఆర్ అలర్ట్ అయ్యారు. రాజకీయంగా తిరిగి యాక్టివ్ కావాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ బహిరంగ సభల ద్వారా తిరిగి ప్రజా క్షేత్రంలోకి వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా రెండు సభలకు నిర్ణయించారు. రేవంత్ ప్రభుత్వం లక్ష్యంగా కేసీఆర్ సమరానికి సిద్ధం అవుతున్నారు. ప్రజల్లోకి కేసీఆర్ తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత కేసీఆర్ కేవలం పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వచ్చారు. విపక్ష నేత అసెంబ్లీ సమావేశానికి ఒక్క సారి మాత్రమే హాజరయ్యారు. పార్టీ నేతలతో అప్పుడప్పుడూ భేటీ అవుతున్నారు. కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితం కావటం పైన సీఎం రేవంత్.. మంత్రులు పలు సందర్భాల్లో విమర్శలు చేసారు. అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సూచనలు చేయాలని సూచించారు. ఇక, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల దిశగా చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయింది. ఈ

# ఇచ్చేదేలే..

- జగన్‌కు దక్కని ప్రతిపక్ష హోదా
- స్పష్టం చేసిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న
- 11 మంది ఎమ్మెల్యేలుంటే ప్రతిపక్ష హోదా రాదు
- కనీసం 18 మంది ఎమ్మెల్యేలుండాలన్న స్పీకర్

2




**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో గత ఎన్నికల్లో 11 సీట్లు సాధించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కూటమి ప్రభుత్వం విపక్ష నేత హోదా ఇవ్వకుండా నిరాకరించింది. ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని పలుమార్లు కోరిన జగన్.. ఆయన పట్టించుకోకపోవడంతో హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయినా జగన్ కు ఊరట దక్కలేదు. ఈ నేపథ్యంలో స్పీకర్ అయ్యనపాత్రుడు జగన్‌కు విపక్ష నేత హోదా విషయంలో తన నిస్సహాయతను బయటపెట్టేశారు. అదీ ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలోనే కావడం మరో విశేషం. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను అసెంబ్లీకి హాజరుకావాలంటూ తాను స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో సూచించానని అయన్నపాత్రుడు తెలిపారు. కానీ జగన్ అసెంబ్లీకి రాకుండా.. తన ప్యాలెస్‌లో కూర్చొని మాట్లాడుతున్నారని ఆక్షేపించారు.

# రాగూర్ ఎపిసోడ్ రిపీట్!

- డెడ్ బాడీకి ట్రీట్మెంట్.. మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్
- మదీనగూడలోని సిద్ధార్థ న్యూరో ఆస్పత్రి తనిఖీలకు మంత్రి ఆదేశం
- ఆపరేషన్ థియేటర్ సీజ్..రుజువైతే ఆసుపత్రి లైసెన్స్ రద్దు

2





**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హైదరాబాద్‌లో ఠాగూర్ ఎపిసోడ్‌పై వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. మదీనగూడలోని సిద్ధార్థ న్యూరో ఆస్పత్రిలో తక్షణం తనిఖీలు చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోని అధికారులు ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్నారు. ఠాగూర్ సినిమా తరహాలో సిద్ధార్థ ఆస్పత్రిలో డెడ్ బాడీకి ట్రీట్మెంట్ చేశారని రెండు రోజుల క్రితం బాధితులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో తెలంగాణ ప్రభుత్వం రంగంలోకి దిగింది. బాధితుల ఆగ్రతను సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఆస్పత్రి యాజమాన్యం మానవత్వానికే మచ్చ తెచ్చేలా వ్యవహరించిందని విమర్శలు ఎదుర్కొంటోంది. చనిపోయిన మహిళ బతికి ఉన్నట్లు నమ్మించి మూడు రోజుల పాటు వైద్యం చేసి లక్షల రూపాయల డబ్బు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన 26 ఏళ్ల సుహాసిని నరాల సంబంధిత వ్యాధితో మదీనగూడలోని సిద్ధార్థ ఆస్పత్రిలో నెల రోజుల క్రితం చేరింది. కళ్లు తిరిగి పడిపోవడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్చగా, నెల రోజుల నుంచి చికిత్స చేస్తున్నట్లు, ఆమె కోలుకుంటున్నట్లు డాక్టర్లు చెప్పారని బాధితులు తెలిపారు. అయితే తమ వద్ద డబ్బు లేదని, చేతిలో డబ్బంతా వైద్యం కోసం ఖర్చు

### వైసీపీ అక్రమాలపై దర్యాప్తు సంస్థలకు
# బ్యాంకర్లు సహకరించాలి

- సీఎం చంద్రబాబు బ్యాంకర్లకు పిలుపు
- ఎస్ఎల్బీసీసమావేశంలో బ్యాంకర్లకు సీఎం దిశానిర్దేశం
- రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం పనిచేసేందుకు
- ప్రభుత్వంతో బ్యాంకులు చేయి కలపాలి

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

వైసీపీ అక్రమాలపై దర్యాప్తు సంస్థలకు బ్యాంకర్లు సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు ఎస్ఎల్బీసీ సమావేశంలో బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని కోరారు. పీ4 పాలసీ, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక భరోసా, ప్రాథమిక రంగానికి రుణాలు, డ్వాక్రా రుణాలు వంటి అంశాలను ప్రస్తావించారు. అలానే ముద్ర రుణాలు, పీఎం స్వనిధి, స్టాండప్ ఇండియా, టిడ్కో ఇళ్లు, రూరల్ ప్రాంతాల్లో బ్యాంకింగ్ నెట్ వర్క్ విస్తరణ సహా పలు అంశాలపై బ్యాంకర్లతో చర్చించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ముఖ్యంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం పనిచేసేందుకు ప్రభుత్వంతో బ్యాంకులు చేయి కలపాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు

# మందు ప్రియులకు
# ఏపీ సర్కార్ షాక్!

- ఏపీలో పెరిగిన మద్యం ధరలు
- 15 శాతం ధరలు పెంచిన ఏపీ ప్రభుత్వం
- రూ.99కి విక్రయించే బ్రాండ్లు, బీరు మినహా మిగిలిన మద్యం రకాల ధర పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- నేటి నుంచే అమలు




**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలోని కూటమి ప్రభుత్వం మద్యం ధరలపై కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం ధరలపై 15 శాతం పెంచుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, రూ.99కి అమ్మే మద్యం బ్రాండ్లు, బీర్లకు ఈ ధర పెంపు వర్తించదు. మిగతా అన్ని రకాల మద్యంపై... పెంచిన ధరలు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించింది.రాష్ట్రంలో మద్యం విక్రయాలపై మార్జిన్‌ను ప్రభుత్వం ఇటీవలే 14.5 నుంచి 20 శాతానికి పెంచింది. ఇప్పుడు 15 శాతం ధరల పెంపుతో మందుబాబులకు షాకిచ్చింది. దేశీయ తయారీ ఫారెన్ లిక్కర్, ఫారెన్ లిక్కర్ కేటగిరీ మద్యంపై ఏఆర్ఈటీ (అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్) విధించనున్నారు.

## కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు

2

## మస్తాన్ సాయి కేసు.. ఏకంగా పోలీసులతోనే బేరసారాలు

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న మస్తాన్ సాయి కేసులో రోజుకో రహస్యాలు బయటకు వస్తున్నాయి. యువతులను బ్లాక్ మెయిల్ చేసి వారిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. నగ్న వీడియోల కేసులో లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్తాన్ సాయిని అరెస్ట్ చేసిన పోలీసులు జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. అలాగే మస్తాన్ సాయి ఎఫ్ఐఆర్‌లో కూడా కీలక విషయాలు వెల్లడించారు పోలీసులు. నగ్న వీడియోలే కాకుండా డ్రగ్స్ పార్టీలు కూడా చేసుకున్నట్లు బయటపడింది. వారాంతాల్లో మస్తాన్ సాయి ఇంట్లో జరిగే డ్రగ్స్ పార్టీలకు యువతీయువకులు పాల్గొన్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో డ్రగ్స్ బయటపడటంతో నార్కోటిక్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. ఇక తాజాగా మస్తాన్ సాయిపై లావణ్య కేసులో మరో ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మస్తాన్ సాయి, అతడి తండ్రి మాట్లాడిన ఆడియో బయటపడింది. వీరు ఏకంగా పోలీసులతోనే బేరసారాలు ఆడినట్లు ఆడియోలో స్పష్టంగా వినిపిస్తోంది. మస్తాన్ సాయిపై లావణ్య పెట్టిన కేసులో పోలీసులతో బేరసారాలకు దిగారు వీరు. గతంలో ఏపీలోని గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయిపై లావణ్య కేసు పెట్టింది. ఈ క్రమంలో ఈ కేసును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పోలీసులతో బేరసారాలు ఆడినట్లు తెలుస్తోంది. ఛార్జ్‌షీట్ వేసే సమయంలో తమకు అనుకూలంగా రాస్తే డబ్బులు ఇస్తామని మస్తాన్ సాయి, అతడి తండ్రి పోలీసులకు తెలిపారు. పోలీసులకు డబ్బులు ఎరవేసి మరీ తనకు అనుకూలంగా కేసును మార్చుకున్నాడు మస్తాన్ సాయి. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఉన్నది ఉన్నట్లుగా కాకుండా మనకు అనుకూలంగా ఛార్జ్‌షీట్ ఉండాలని తండ్రితో మస్తాన్ సాయి మాట్లాడిన ఆడియో ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది.



## దేవులపల్లి రమేశ్‌కు ప్రశంసలు



**సిద్దిపేట,ఫిబ్రవరి 09:** తెలంగాణ సాహిత్య అకాడమీ తెలుగు భాషా చైతన్య సమితి, ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి (1925–2025) నిర్వహించిన "దాశరథి సాహిత్య సమాలోచన"13,లో భాగంగా దాశరథి జీవితం- సాహిత్యం, మనోవిజ్ఞానిక, విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ సి. వీరేందర్ చేసిన ఉపన్యాసంలో పాల్గొన్న, ఎంజేపీ గురుకుల పాఠశాల, తెలుగు అతిథి ఉపాధ్యాయుడు, దేవులపల్లి రమేశ్,ను తెలంగాణ సాహిత్య అకాడమీ, కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలుగు భాషా చైతన్య సమితి, అధ్యక్షులు,పి.బడేసాబ్,డా.ఎల్ల కల్లేష్, అభినందిస్తూ అంతర్జాలం ద్వారా పంపిన ప్రశంస పత్రాన్నికవి,రచయిత,దేవులపల్లి రమేశ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు, సాహిత్య మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## శేఖర్ బాషాపై మరో వేధింపుల వ్యవహారం



**హైదరాబాద్-నవభూమి:** బిగ్‌బాస్ ఫేమ్, ఆర్జే శేఖర్ బాషాపై ) మరో వేధింపుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రెడ్ స్యాండిల్ యాంటీ టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, శేఖర్ బాషా తనను మోసం చేశారని బాధితురాలు లక్ష్మీ ఆరోపించింది. బాధితురాలు మాట్లాడుతూ.. గతంలో ఓ అబ్బాయిపై ఫిర్యాదు చేయడానికి వెళ్ళితే ఎస్పీ శ్రీనివాస్ తనను ట్రాప్ చేశారని ఆమె తెలిపారు. మానసికంగా వేధించి తనపై లైంగిక దాడి చేశాడన్నారు. తనను, తన ఫ్యామిలీని అంతం చేస్తానని ఎస్పీ శ్రీనివాస్ బెదిరిస్తున్నాడని తెలిపారు.అయితే ఈ కేసు శేఖర్ బాషా తనకు సహాయం చేస్తానని చెప్పి వేధింపులకు గురిచేశాడని బాధితురాలు తెలిపింది. బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషా తనకు ఓ ఈవెంట్‌లో పరిచయం అయినట్లు చెప్పుకొచ్చారు. "ఎస్పీపై పెట్టిన కేసును నేను శేఖర్ బాషాకు చెపితే హెల్ప్ చేస్తానని మోసం చేశాడు.శేఖర్‌బాషా కూడా నన్ను వేధింపులకు గురి చేస్తున్నాడు. శేఖర్ బాషా, ఎస్పీ శ్రీనివాస్ ఇద్దరు చేతులు కలిసి నన్ను హింసిస్తున్నారు" అంటూ బాధితురాలు వాపోయింది.శేఖర్ బాషా వలన గతంలో ఓ అమ్మాయి చనిపోయిందని వెల్లడించింది. ఎస్పీతో ఉన్న కొన్ని ప్రైవేటు వీడియోలను యూట్యూబ్ ఛాన్సల్‌లో పెట్టి వేధిస్తున్నట్లు ఆమె తెలిపింది. ఎస్పీ శ్రీనివాస్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. ఎస్పీ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. శ్రీనివాస్ భార్యకు విషయం మొత్తం చెప్పిన కూడా ఆమె కూడా భర్తకు సపోర్ట్ చేస్తోందన్నారు. తనకు న్యాయం కావాలని బాధితురాలు డిమాండ్ చేస్తోంది. కాగా.. సోషల్ మీడియాలో ఎస్పీ, శేఖర్ బాషాకు సంబంధించిన పలు వీడియోలు వైరల్‌గా మారాయి. శేఖర్ బాషా, ఎస్పీ శ్రీనివాస్ తనను మోసం చేశారని గతంలో బాధితురాలు అనేక సార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికకు వెల్లువెత్తిన నామినేషన్లు




**కరీంనగర్-నవభూమి:** నేటితో ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఇప్పటి వరకు 60కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రోజు సాయంత్రంతో నామినేషన్ల దాఖల గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో దాఖలైన నామినేషన్లను మంగళవారం పరిశీలించనున్నారు.
అయితే ఈ నామినేషన్లు ఉప సంహరించుకోనే గడువు 13వ తేదీతో ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3వ తేదీన ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను మార్చి 8వ తేదీలోగా పూర్తి చేస్తారు.తెలుగు రాష్ట్రాల్లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ దాఖలు గడువు నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ, నల్లగొండ – ఖమ్మం – వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీకి ఇప్పటి వరకు మొత్తం 85 నామినేషన్లు దాఖలైనాయి.ఇక వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు 17 మంది 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డితోపాటు బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, టీజేఏసీ అభ్యర్థిగా హర్షవర్ధన్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్‌ను వేశారు. అయితే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండడం గమనార్హం.తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ రెండు రాష్ట్రాల్లో మూడు, మూడు చొప్పున మొత్తం 6 ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29వ తేదీన ఈ ఆరు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నిలకు అనివార్యమైనాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని అభ్యర్థులు ముమ్మరం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి.

## కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది.క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈరోజు విచారణ జరిపింది.42 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటూ అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా నివేదికను సమర్పించారు.

### వాళ్లు అనుకుంటే రామరాజ్య స్థాపన కష్టమేమీ కాదు..

## రంగరాజన్ మీద దాడిపై చినజీయర్ స్వామి స్పందన



**హైదరాబాద్-నవభూమి:** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ మీద జరిగిన దాడిపై త్రిదండి చిన్నజీయర్ స్వామి స్పందించారు. రంగరాజన్‌పై జరిగిన దాడి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమాజంలో ఆలయాల అర్చకుల పరిస్థితి బాగోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకుల ఆర్థిక పరిస్థితికి, విద్యా అవకాశాలు లేకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రంగరాజన్ మీద జరిగిన దాడి విషయం తనకు తెలిసిందని.. హింస ద్వారా రామరాజ్యం స్థాపన జరగటమనేది అసాధ్యమని చినజీయర్ స్వామి అభిప్రాయపడ్డారు. సమాజంలో హింసకు తావు లేదన్న ఆయన, తీవ్రవాదంతోనో ఉగ్రవాదంతోనో సాధించేది ఏమీ లేదని స్పష్టం చేశారు. అలాంటి వాటి వల్ల కేవలం తాత్కాలిక లాభాలు చేకూరుతాయని.. కానీ అవి శాశ్వతం కాదని తెలిపారు. రామరాజ్య స్థాపన రాజ్యాంగబద్ధంగా జరగాలని చిన్నజీయర్ స్వామి ఆకాంక్షించారు. రామరాజ్య స్థాపన అనేది ఏ ఒక్కరితోనో సాధ్యమయ్యేది కాదన్నారు. సమాజంలోని ప్రజలంతా ముక్తకంఠంతో అనుకుంటే రామరాజ్య స్థాపన కష్టమేమి కాదని చెప్పుకొచ్చారు.మరోవైపు.. రంగరాజన్ మీద జరిగిన దాడి ఘటనపై రాజకీయ, ఆధ్యాత్మిక వేత్తలు స్పందిస్తున్నారు. రంగరాజన్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా స్పందిచారు. రంగరాజన్ మీద దాడి జరగటం దురదృష్టకరమన్నారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా.. ధర్మపరిరక్షణపై దాడిగా భావించాలన్నారు.ఫిబ్రవరి 7వ తేదీ తెల్లవారుజామున సుమారు 20 మంది చిలుకూరు బాలాజీ ఆలయంలోని తన ఇంటికి వచ్చి తనపై, తన కుమారిడిపై దాడి చేసినట్టుగా రంగరాజన్ మొయినాబాద్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. వీర రాఘవరెడ్డితో పాటు ముగ్గురు, నలుగురు తనపై దాడి చేస్తుంటే.. కొందరు ఆ దాడిని వీడియో చిత్రీకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ మాట వినకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని.. ఫలితం భయానకంగా ఉంటుందని హెచ్చరించినట్లు తెలిపారు. తన సైన్యం కోసం మనుషులను రిక్రూట్ చేయాలని.. తనకు మద్దతు ఇవ్వాలని బెదిరించినట్లు వివరించారు. తాను మాట్లాడడానికి ప్రయత్నించినప్పుడల్లా.. తనను కొట్టారని, తాను మాట్లాడకూడదని, వినాల్సిందే అంటూ బెదిరించినట్టుగా రంగరాజన్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత కేసు..

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో పార్టీ ఫిరాయింపు నేతలపై బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో సోమవారం (ఫిబ్రవరి 10న) విచారణ జరిగింది. బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచి.. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.పార్లమెంటరీ ప్రక్రియను ఫ్రస్ట్రేషన్‌కు గురి చేయొద్దని.. ప్రజాస్వామ్యంలో పార్టీలకు హక్కులు ఉంటాయని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎమ్మెల్యేలు పార్టీలు మారి 10 నెలలు అయిందని గుర్తు చేసిన సుప్రీం కోర్టు.. ఇది రీజనబుల్ టైం కాదా అంటూ ఎమ్మెల్యేల తరపు లాయర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. తనకు వాదనలు వినిపించేందుకు రెండు మూడు రోజుల సమయం కావాలని ఎమ్మెల్యేల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి అడిగారు.ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పులను కోట్ చేస్తూ.. రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని.. ఇప్పుడు ఏకంగా 10 నెలలు గడిచిపోయాయని బీఆర్ఎస్ తరపు న్యాయవాది వాదించారు. రీజనబుల్ టైమ్ అంటే ఎంత సమయం కావాలో చెప్పండంటూ ధర్మాసనం ముకుల్ రోహిత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఎమ్మెల్యేలపై చర్యలకు స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని ముకుల్ రోహత్గి తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. ఈ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, డాక్టర్ సంజయ్ కుమార్, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటికే ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్‌పై రోజురోజుకు ఒత్తిడి పెరుగుతోందని.. సుప్రీంకోర్టు జోక్యంతో వారిపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ అనర్హత వేటు పడితే.. తెలంగాణలో ఉపఎన్నికలు వస్తాయని అంచనాలు వేస్తున్నారు.

## చిలుకూరు ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి

**(1వపేజీ తరువాయి)** నేతలు ఖండించారు.
మరోవైపు.. చిలుకూరు శ్రీబాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి సంబంధించిన అంశాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో వివరించారు. ప్రధాన నిందితుడు కొవ్వూరి వీర రాఘవరెడ్డిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, తన సంస్థలో హిందువులను చేర్పించాలంటూ రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ దాడి చేసిందని తెలిపారు.
అయితే 2022లో రామరాజ్యం పేరుతో సోషల్ మీడియాలో సంస్థను కొవ్వూరి వీర రాఘవ రెడ్డి ప్రారంభించారని చెప్పారు. ఆ క్రమంలో సోషల్ మీడియాలో భగవద్గీత శ్లోకాలతో పాటు హిందువులు.. ఈ సంస్థలో చేరే విధంగా వీడియోలు పోస్ట్ చేశాడన్నారు. ఈ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ. 20 వేలు జీతం ఇచ్చే విధంగా ప్రకటనలు చేశాడని తెలిపారు.
ఈ నేపథ్యంలో రాఘవ రెడ్డి మాటలు నమ్మి దాదాపు 25 మంది ఈ రామరాజ్యం ఆర్మీలో చేరారన్నారు. ఈ జనవరి 24వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు పట్టణంలో వీళ్ళంతా సమావేశమయ్యారని వివరించారు. ఇక గుంటూరు జిల్లా కోటప్పకొండలో తల రూ. 2 వేలు చెల్లించి యూనిఫామ్ కుట్టించుకున్నారని తెలిపారు.అయితే ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం వీరంతా చిలుకూరుకు మూడు వాహనాల్లో వెళ్లి.. రంగరాజన్‌పై దాడి చేశారన్నారు. అయితే వీరంతా ఈ దాడికి పాల్పడే ముందు యాప్రాల్‌లో కలిసి ఫోటోలు దిగారన్నారు. నల్లని దుస్తులు ధరించిన 20 నుంచి 25 మంది రంగరాజన్ నివాసానికి మూడు వాహనాల్లో వచ్చారని చెప్పారు. ఆర్థికంగా సపోర్ట్ చేయడంతోపాటు "రామరాజ్యం ఆర్మీ"లో వ్యక్తులను రిక్రూట్ చేయాలంటూ రంగరాజన్‌ను వారు డిమాండ్ చేశారన్నారు. అందుకు ఆయన అంగీకరించ లేదన్నారు. దీంతో ఆయనపై దాడి చేశారని.. దీంతో ఫిబ్రవరి 8వ తేదీన తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. అయితే అదే రోజు.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వీర రాఘవరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ఈ రోజు.. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మహిళలతోపాటు ఐదుగురిని అరెస్టు చేసామని వివరించారు.చిలుకూరు శ్రీబాలాజీ దేవాలయం తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందింది. ఈ దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొనేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అలాంటి దేవాలయంలో రంగరాజన ప్రధాన అర్చకుడిగా ఉన్నారు. ఆయన తండ్రి సౌందర్ రాజన్ సైతం ఇదే దేవాలయంలో అర్చకునికా విధులు నిర్వహించారు. ఇక ఈ దేవాలయం ప్రధాన అర్చకుడి రంగరాజన్ పై దాడి ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం విధితమే.

## లడ్డూ కల్తీగాళ్లు దొరికారు

**(1వపేజీ తరువాయి)** ట్యాంకర్లలోని నెయ్యి నాణ్యత సరిగ్గా లేదని, కల్తీ జరిగిందని గుర్తించిన తితిదే.. వాటిని పరీక్షించేందుకు గుజరాత్లోని ఎన్డీడీబీ కాఫ్ ల్యాబ్కు పంపించింది. ఆ శాంపిళ్లలో గొడ్డు కొవ్వు, పంది కొవ్వు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. దీనిపై విచారణకు తొలుత రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది. తర్వాత గత అక్టోబరులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ పోలీసు శాఖ నుంచి ఇద్దరు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఒకరితో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సిట్ ప్రస్తుతం విచారణ జరిపి నలుగురిని అరెస్టు చేసింది.న్యాయమూర్తి ముందు
ప్రవేశపెట్టారు. వారికి ఈ నెల 20 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. ఈ కేసులో ఇవే తొలి అరెస్టులు. వైకాపా హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఫిర్యాదుపై గతేడాది సెప్టెంబరు 25న తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఏపీ పోలీసు అధికారులతో ఏర్పాటైన సిట్ ఇటీవల దర్యాప్తు ముమ్మరం చేసింది. సీబీఐ హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, ఇతర సభ్యులు.. గత మూడు రోజులుగా వైష్ణవి డెయిరీకి చెందిన డ్రైవర్లు, తితిదే సిబ్బందిని విచారించారు. అక్కడ వెల్లడైన సమాచారం ఆధారంగా విపిన్ జైన్, పొమిల్ జైన్, అపూర్వ చావడా, రాజు రాజశేఖరన్‌ను ఆదివారం విచారణకు పిలిపించి ప్రశ్నించారు.
ఏఆర్ డెయిరీ పేరును ముందు పెట్టి తప్పుడు డాక్యుమెంట్లు, సీళ్లు, ఇతర పత్రాలు ఉపయోగించి టెండర్లలో పాల్గొన్నట్లు గుర్తించింది. అసలు భోలేబాబాకూ భారీ ఎత్తున నెయ్యి ఉత్పత్తి చేసే సామర్థ్యం లేదని, ఆ సంస్థ మిగతా చోట్ల సేకరించి సరఫరా చేసిందని గుర్తించింది. వీటిపై సిట్ అధికారులు వేసిన ప్రశ్నలకు డెయిరీ ప్రతినిధులు సమాధానమివ్వలేదు.
భోలేబాబా నుంచి కిలో నెయ్యి రూ.355కు కొనుగోలు చేసి శ్రీవైష్ణవి డెయిరీ ఏఆర్ డెయిరీకి రూ.319.80కి సరఫరా చేసినట్లు రికార్డుల్లో ఉంది. ఎక్కువ ధరకు కొని తక్కువ మొత్తానికి సరఫరా చేయడం ఎలా సాధ్యం? కల్తీ చేయలేదా? అని విచారణలో ప్రశ్నించగా, డెయిరీ ప్రతినిధులు స్పందించలేదని సమాచారం.
ఆయా డెయిరీల ఉత్పత్తి సామర్థ్యం ఎంత? వారు ఎక్కడి నుంచి పాలు సేకరిస్తున్నారు? తదితర వివరాలు సిట్ అధికారులు రాబట్టారు. తితిదేతో ఏఆర్ డెయిరీ ఒప్పందం చేసుకుంటే శ్రీవైష్ణవి డెయిరీ నుంచి ఎందుకు సరఫరా చేశారు? మార్కెట్లో కిలో నెయ్యి ధర కనిష్ఠంగా రూ.500కు పైగా ఉంటే రూ.320కే సరఫరా చేస్తామని ఎలా ఒప్పందం చేసుకున్నారు? తదితర విషయాలు ఆరా తీశారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్...

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆదివారం పెద్ద సంఖ్యలో జనం కుంభమేళాకు బయలుదేరడంతో ప్రయాగ్‌రాజ్ వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్ ఇదేనని, సుమారు 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయని అధికార వర్గాల సమాచారం. హైవేపై భారీ ట్రాఫిక్ జామ్ కారణంగా ముందుకు వెళ్లలేక, వెనక్కి తిరిగి రాలేక జనం అవస్థలు పడుతున్నారు. ఆకలిదప్పులతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ కదలడం లేదని, ప్రయాగ్ రాజ్ ఇంకా 300 కిమీ దూరం ఉందని ఓ వాహనదారుడు చెప్పారు. భక్తుల రద్దీ కారణంగా సంగం రైల్వే స్టేషన్‌ను అధికారులు వరకు మూసివేశారు. యూపీ సర్కారు వైఫల్యం వల్లే కుంభమేళా కు వెళుతున్న భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారని అఖిలేశ్ ఆరోపించారు.

## మైడియర్ ఫ్రెండ్ ట్రంప్..

**(1వపేజీ తరువాయి)** అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు తాను ఆయనతో కలిసి పనిచేశానని, అప్పట్లో చర్చించిన పలు విషయాల ఆధారంగా ప్రస్తుతం చర్చల్ని ముందుకు తీసుకెళ్తానని వెల్లడించారు. అసలే భారత్–అమెరికా మధ్య వలసల విషయంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో మోడీ యూఎస్ టూర్ ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆరుగురి అరెస్టు:డీసీపీ

**(1వపేజీ తరువాయి)** వీరరాఘవరెడ్డి, ఇద్దరు మహిళలు సహా మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.. "ఈ ఉదయం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించాం. నిందితులు ఖమ్మం నిజామాబాద్కు చెందినవారు. ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నాం. తమకు ఆర్థికంగా సాయం చేయాలని, రామరాజ్యంలో సభ్యుల్ని చేర్పించాలని రంగరాజను డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించడంతో ఆయనపై దాడి చేశారు" అని డీసీపీ వివరించారు.
"2022లో వీరరాఘవరెడ్డి 'రామరాజ్యం'ను స్థాపించాడు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ప్రచారం చేశాడు. రామరాజ్యంలో చేరితే రూ.20వేలు జీతం ఇస్తానని చెప్పాడు. తణుకు. కోటప్పకొండలో వీరరాఘవరెడ్డి పర్యటించాడు. రామరాజ్యంలో చేరిన వారిని యూనిఫామ్ కుట్టించుకోమన్నాడు. ఈ నెల 6న అందరూ యాప్రాల్లో కలిశారు. రామరాజ్యం బ్యానర్తో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. వాటితో సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ నెల 7న మూడు వాహనాల్లో వీరరాఘవరెడ్డి అనుచరులు 25 మంది నల్ల దుస్తుల్లో చిలుకూరు వచ్చి రంగరాజన్పై దాడి చేశారు. ప్రస్తుతం మణికొండలో ఉంటున్న వీరరాఘవరెడ్డి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం" అని డీసీపీ తెలిపారు.

## బాస్ ఈజ్ బ్యాక్!

**(1వపేజీ తరువాయి)** సమయంలో కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ – రైతు అంశాలపై తాను మౌనంగా ఉంటూనే గంభీరంగా పరిస్థితులు గమనిస్తున్నానని తాజాగా పార్టీ నేతల భేటీలో కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల్లో ప్రభుత్వం పైన వ్యతిరేక పెరుగుతోందని వ్యాఖ్యానించారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా కుల గణన గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటోంది. అటు రైతు రుణమాఫీ అమలుతో పాటుగా రైతు భరోసా అమలు చేస్తున్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. బీసీ గణన పైన ఢిల్లీ నేతలను ఆహ్వానించి భారీ సభకు ప్లాన్ చేసింది. ఈ సమయంలో కేసీఆర్ సైతం బీసీ – రైతు అంశాల పైన రెండు భారీ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందు కోసం వేదికలను ఖరారు చేసారు. ఈ సభల ద్వారా తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారు. ఈ మేరకు కేటీఆర్ పార్టీ నేతలకు స్పష్టత ఇచ్చారు. రెండు సభలతో కామారెడ్డి వేదికగా బీసీ గర్జన, గజ్వేల్ వేదికగా రైతు గర్జన నిర్వహించాలని నిర్ణయించారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రత్యేకించి 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని పార్టీ నేతలు నిర్ణయించారు. రైతు రుణమాఫీ..రైతు భరోసా అమలు పైనే ప్రధానంగా ఈ సభ ద్వారా కేసీఆర్ ప్రశ్నించనున్నారు. అదే విధంగా కామారెడ్డిలో కాంగ్రెస్ గతంలో నిర్వహించిన సభ ప్రదేశంలోనే తాము భారీ సభ ఏర్పాటు చేసి బీసీలకు ఇచ్చిన హామీలు.. కులగణనలో చోటు చేసుకున్న లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. అటు బీజేపీ సైతం ఇదే అంశం పైన ప్రజల్లోకి వెళ్లేలా కొత్త కార్యాచరణ సిద్దం చేస్తోంది. దీంతో.. తెలంగాణలో మళ్లీ రాజకీయంగా కీలక పరిణామాలు.. మూడు పార్టీల సమరం హోరా హోరీగా కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

## రాగూర్ ఎపిసోడ్ రిపీట్!

**(1వపేజీ తరువాయి)** చేసినట్లు చెప్పడంతో గత శనివారం డిశ్చార్జి చేశారు. నిమ్స్ తరలించమని సిఫార్సు చేశారు. సిద్ధార్థ సూచనల మేరకు నిమ్స్ ఆస్పత్రిలో చేర్చగా, ఆమె అప్పటికే మరణించిందని అక్కడి వైద్యులు బాధితులకు తెలిపారు. అంతేకాకుండా సుహాసిని మరణించి రెండు మూడు రోజులు అయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో తమకు ఠాగూర్ తరహాలో మోసం చేశారని తెలుసుకున్న బాధితులు.. సిద్ధార్థ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ప్రభుత్వం కల్పించుకుని ఆస్పత్రిలో తనిఖీలకు ఆదేశించింది.


## తల్లికి వందనంలో కోత

**(1వపేజీ తరువాయి)** కొలువు తీరిన కూటమి ప్రభుత్వం ఈ పథకం పైన తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. 2024లో పథకం అమలు చేయకుండా 2025 జూన్‌లో అమలు చేయాలని డిసైడ్ అయింది.
ఖర్చు – లెక్కలు..ఈ ఏడాది జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం సమయంలో ఈ పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయనుంది. దీంతో, ఇక నుంచి ప్రతీ ఏటా అమలు చేసినా.. నాలుగేళ్లే ఈ పథకం అమలు కానుంది. లబ్ది దారులకు ఒక ఏడాది నిధులు కోత పడనున్నాయి. 2024–25 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో దాదాపు 81 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇందులో ప్రాథమికంగా 69.16లక్షల మంది ఈ పథకానికి అర్హులుగా విద్యాశాఖ తేల్చినట్లు సమాచారం. ఇక, ఈ పథకం అమలు కోసం దాదాపు రూ 10,300 కోట్లు అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఇదే సమయంలో విద్యార్థులకు 75 శాతం హాజరు నిబంధన కొనసాగనుంది. 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు కేటాయింపులో భాగంగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు.
విధి విధానాలు..ఈ పథకం అమలుకు సంబంధించిన విధి విధానాల పైన అధ్యయనం కొనసాగుతోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ను సమీక్షిస్తున్నారు. ఆదాయ పన్ను చెల్లింపు దారులు..తెల్లరేషన్ కార్డు లేనివారిని, 300 యూనిట్ల విద్యుత్ వినియోగించేవారిని, కారు కలిగి ఉన్న వారిని, అర్బన్ ప్రాంతంలో 1000 చదరపు అడుగులు కలిగి ఉన్నవారికి పథకం అందటం లేదు. ఇక, ఇప్పుడు కొత్త నిబంధనలను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. విద్యుత్ వినియో గం, కారు ఉండటం వంటి నిబంధనలను గతంలో వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు మినహాయింపు ఇస్తారా.. లేక, కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. దీంతో.. తల్లికి వందనం నిధులు జూన్ లో జమ అవుతాయని స్పష్టత వచ్చినా.. అర్హత, మార్గదర్శకాల పైన లబ్ది దారుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

## ఇచ్చేదేలే..

**(1వపేజీ తరువాయి)** అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడికి ప్రసంగించడానికి ఎంత సమయం ఇస్తున్నారో.. తనకు అంత సమయం ఇవ్వాలని వైఎస్ జగన్ అంటున్నారని, ఇదేం విచిత్రమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సెటైర్లు వేశారు.ప్రస్తుతం వైఎస్ జగన్ కు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యకు ప్రతిపక్ష నేత హోదా రాదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి స్పష్టం చేశారు. 18 మంది ఎమ్మెల్యేలు ఉంటే గానీ ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే వీలు లేదన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా తనకు ఇష్టం వచ్చిన నిర్ణయం తీసుకోలేనన్నారు. అసెంబ్లీ నియమాలు, నిబంధనలు జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి వారి నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలపై చర్చించాలని స్పీకర్ సూచించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
మంగళవారం
11 । ఫిబ్రవరి । 2025



## మహా కుంభమేళాకు రాష్ట్రపతి.. త్రివేణి సంగమంలో పవిత్ర



**ఉత్తర్‌ప్రదేశ్ -నవభూమి:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతి పెద్ద ఆధ్యాత్మిక పండుగ మహాకుంభమేళాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందర్శించారు. ఆమె రాకను పురస్కరించుకుని త్రివేణి సంగమం వద్ద భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. ప్రయాగ్‌రాజ్ విచ్చేసిన రాష్ట్రపతికి ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం భద్రతా సిబ్బంది వెంటరాగా ఫ్లోటింగ్ బోటుపై పర్యటించే సమయంలో వలస పక్షులకు ఆహారం కూడా అందించారు. ఆ తర్వాత త్రివేణి ఘాట్ వద్దకు చేరుకుని పుణ్య స్నానం ఆచరించారు. తర్వాత పూజలు చేశారు.పయాగ్‌రాజ్‌లో వందల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా గతనెల జనవరి 13 న ఆరంభమైంది. ఈ రోజు 29వ రోజు. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే కుంభమేళా కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. యూపీ ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం ఇప్పటివరకూ దాదాపు 44 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26న ముగియనున్న మహా కుంభమేళాకు జన ప్రవాహం పెరుగుందే కానీ తగ్గటం లేదు. రద్దీ ఉన్నప్పటికీ తెల్లవారుజామున 3 గంటల నుంచే వేలాది మంది భక్తులు పవిత్ర స్నానమాచరించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ రోజు కూడా ప్రయాగ్‌రాజ్ చుట్టు పట్ల వందల కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ జామ్ నిలిచిపోయింది.

## సోడా సేవించి ముగ్గురు మృతి.. రంగంలోకి పోలీసులు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఖేడా జిల్లా నదియాద్ నగరంలో ఆదివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా మరణించారు. ప్రాథమికంగా మద్యం సేవించడంతోనే ఈ మరణాలు సంభవించాయని చెబుతున్నారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మరణించిన వారిలో యోగేష్ కుష్వాహా (40), రవీంద్ర రాథోడ్ (50), కనుభాయ్ చౌహాన్ (59) ఉన్నారు. పోలీసుల ప్రకారం ఈ ముగ్గురు వ్యక్తులు జీలకర్ర సోడాతో సహా మద్యం సేవించారని అంటున్నారు. ఆ తర్వాత వారి ఆరోగ్యం క్షీణించి ఒక్కొక్కరు స్పృహ కోల్పోయారు.చేరుకునేలోపు మృతి..ఈ ముగ్గురు వ్యక్తుల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వారిని నాడియాద్ సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ ఆసుపత్రికి చేరుకునేలోపు వారు మృతి చెందారు. ప్రారంభ విచారణలో మృతుల్లో ఇద్దరి రక్తంలో 0.1 ఇథనాల్ ఆల్కహాల్ ఉన్నట్లు, మరొకరిలో 0.2 ఇథనాల్ ఆల్కహాల్ ఉన్నట్లు రక్త నమూనా పరీక్షలు తేల్చాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు, (ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ) బృందం, జిల్లా ఎల్సీబీ, ఎస్ఓజీ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, స్థానిక పోలీసు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి.అదే సమయంలో..మృతుల బంధువుల ప్రకారం కనుభాయ్ చౌహాన్ జవహర్ నగర్ గేటు సమీపంలో ఉండేవారని, అతనికి మద్యం అలవాటు ఉందని చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం కూడా, అతను మద్యం సేవించారని, ఆ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారని అంటున్నారు. అదే సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు కూడా అరగంటలో మరణించారు. వారు కూడా మద్యం సేవించారని తెలుస్తోంది. పోలీసుల పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాత మరింత క్లారిటీ రానుంది.గతంలో ఘటనలు..ఈ ఘటన నేపథ్యంలో గుజరాత్‌లో గతంలో జరిగిన విషపూరిత మద్యం ఘటనలను గుర్తు చేస్తుంది. 2009లో అహ్మదాబాద్‌లో జరిగిన లాఠీ చార్జ్ ఘటనలో 140 మంది మరణించారు. అదే విధంగా 2022లో బోటాడ్‌లో జరిగిన రసాయన సంఘటనలో 35 మంది మరణించారు. 2023 డిసెంబరులో ఖేడా జిల్లాలో జరిగిన సిరప్ ప్రమాదంలో 5 మంది మరణించారు. ఈ ఘటన ప్రతికూలంగా మారిన నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీసు విభాగం దర్యాప్తు స్పీడప్ చేసింది.

## పరీక్షా పే చర్చలో తెలుగమ్మాయి.. ప్రధానిని ఏం అడిగిందంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** పరీక్షల విషయంలో విద్యార్థుల్లో ఉండే భయం, ఒత్తిడి, ఆందోళనను తొలగించేందుకు కృషి చేస్తున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ముగింపులో ఫైనల్స్ ఎగ్జామ్స్‌కు ముందు పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తుంటారు మోడీ. ఇందులో స్టూడెంట్స్‌తో ముచ్చటిస్తూ వాళ్లకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. చదవింది అర్థం చేసుకోవడం, గుర్తుపెట్టుకోవడం, దాన్ని పరీక్షల్లో బాగా రాయడం ఎలాగో వివరిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా ఆయన మరోమారు పరీక్షా పే చర్చలో పాల్గొన్నారు. అయితే ఓ తెలుగమ్మాయి నుంచి ఆయనకు ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. ఇంతకీ ఎవరా అమ్మాయి? ప్రధానిని ఆమె అడిగిన క్వశ్చన్ ఏంటి? అనేది ఇప్పుడు చూద్దాం..ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి శస్త్ర అనే బాలిక పరీక్షా పే చర్చ ప్రోగ్రామ్‌లో పాల్గొంది. పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని.. ప్రధాని మోడీని ఆసక్తికర ప్రశ్న అడిగింది. ఇటీవల కాలంలో వాతావరణ మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయని.. ప్రకృతిని కాపాడుకునేందుకు ఏమేం చేయాలని ఆమె క్వశ్చన్ చేసింది. దీనికి ప్రధాని స్పందిస్తూ.. 'ఇది చాలా మంచి ప్రశ్న. వాతావరణం గురించి పిల్లలు ఆలోచిస్తుండటం శుభపరిణామం. భోగాలు అనుభవించాలని అనుకునే కొందరు తమ సంతోషం కోసం ప్రకృతిని నాశనం చేశారు. ప్రకృతిని నాశనం చేయడం మన కల్చర్ కాదు' అని మోడీ చెప్పుకొచ్చారు. లైఫ్ స్టైల్ అనేది తన మిషన్ అని.. దీనర్థం ప్రకృతిని కాపాడేలా మన జీవనశైలిని మార్చుకోవడమేనని తెలిపారు ప్రధాని. నేల, నీరును తల్లిగా భావించడం మన సంప్రదాయమని వ్యాఖ్యానించారు. ప్రకృతి సంరక్షణలో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ కోసం ఒక మొక్క)' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ భారీగా చెట్లు నాటుతున్నామని చెప్పుకొచ్చారు.

## మహామండలేశ్వర్ పదవికి రాజీనామా

### ఇన్‌స్టాలో వెల్లడించిన మమతా కులకర్ణి

**న్యూఢిల్లీ-నవభూమి:** కిన్నర్ అఖాడా మహామండలేశ్వర్ పదవికి తాను రాజీనామా చేసినట్టు బాలీవుడ్ నటి మమతా కులకర్ణి అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు సోమవారంనాడు ఒక వీడియోను సామాజిక మాధ్యమంలో ఆమె షేర్ చేశారు. మమతా కులకర్ణి నియామకంపై ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠి, కిన్నర్ అఖారా వ్యవస్థాపకుడు రిషి అజయ్ దాస్ మధ్య విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఆమె తాజా నిర్ణయం తీసుకున్నారు. తన నిర్ణయాన్ని సామాజిక మాధ్యమంలో వెల్లడించారు.
"నేను (మహామండలేశ్వర్ మమత నందగిరి) నా పదవికి రాజీనామా చేశాను. ఈ విషయంలో రెండు గ్రూపులు గొడవ పడటం సరికాదు. 25 ఏళ్లుగా నేను సాధ్విగా ఉన్నాను, ఇకముందు కూడా అలాగే కొనసాగుతాను. మహామండలేశ్వర్‌గా నన్ను నియమించడంపై గొడవ పడటం సరికాదు. 25 ఏళ్ల క్రితమే నేను బాలీవుడ్‌ను విడిచిపెట్టాను. అప్పట్నించీ అందరికీ, అన్నింటికీ దూరంగా ఉంటూ వచ్చాను. నా గురించి ప్రజలు రకరకాలుగా స్పందించడం చూశాను. శంకరాచార్య కావచ్చు, మరొకరు కావచ్చు...నన్ను మహామండేలశ్వర్‌గా నియమించడం కొందరికి అభ్యంతరకరంగా తోచి ఉండవచ్చు. నేను కైలాస్‌కో, మానస సరోవర్‌కో వెళ్లనక్కర లేదు. 25 ఏళ్ల తపస్సుతో విశ్వం నా కళ్లముందే ఉంది" అని ఆ వీడియోలో మమతా కులకర్ణి వివరించారు.మహామండలేశ్వర్‌గా మమతా కులకర్ణిని నియమించడంపై అఖారా సాధువులు పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. దీనిపై రిషి అజయ్ దాస్ చర్యలు తీసుకున్నారు. మమతా కులకర్ణి, లక్ష్మీనారాయమఅ త్రిపాఠిలను పదవుల నుంచి తొలగించారు. దీనిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# కోతి చేసిన పనికి శ్రీలంక వ్యాప్తంగా కరెంట్ కట్!



**న్యూఢిల్లీ-నవభూమి:** కోతుల గురించి అవి చేసే రచ్చ గురించి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఊరికే వెళ్తున్న వారిపై విరుచుకు పడుతూ.. రచ్చ చేసే కోతులను చూస్తే ధైర్యంగా ఉండే వాళ్లకంటే భయపడే వాళ్లే ఎక్కువ. అదే ఒకటీ, రెండు కోతులు మాత్రమే ఉంటే పెద్దగా భయపడకుండా ఏ రాయో, కట్టెనో తీసుకుని వెళ్లగొడుతుంటారు. అవి కూడా జనాలు ఎక్కువ ఉంటే జంకుతుంటాయి. కానీ తాజాగా ఓ కోతి మాత్రం దేశ ప్రజలందరినీ ముప్పు తిప్పలు పెట్టింది. అది చేసిన ఓ పని వల్ల శ్రీలంక దేశ వ్యాప్తంగా కరెంట్ బంద్ అయింది. ఆ కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.శ్రీలంకలో ఫిబ్రవరి 9వ తేదీ రోజు అంటే ఆదివారం.. దేశవ్యాప్తంగా కరెంట్ బంద్ అయింది. ఒక్కసారిగా దేశం మొత్తం విద్యుత్ నిలిచిపోవడంతో.. ప్రజలు అంతా తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఆసుపత్రులు, కార్యాలయాల్లో పనులన్నీ నిలిచిపోయాయి. ముఖ్యంగా అత్యవసరం అనుకున్న వాళ్లంతా జనరేటర్లనపైనే ఆధార పడాల్సి వచ్చింది. ఉదయం 11 గంటలకు కరెంట్ పోగా.. రాత్రయినా రాలేదు.
విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. సదరు ఆఫీసర్లకు ప్రజలు ఫోన్ల మీద ఫోన్లు చేశారు. అలాగే అనేక మంది సోషల్ మీడియా వేదికగా కరెంటు లేదంటూ పోస్టులు పెట్టడం ప్రారంభించారు. దీనిపై స్పందించి శ్రీలంక ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. అసలు సమస్య ఎక్కడ వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు పెద్ద ఎత్తునే చర్యలు చేపట్టారు. కొన్ని గంటల పాటు శ్రమించగా.. కరెంటు పోవడానికి గల కారణాన్ని కనుక్కున్నారు.అయితే ఇదే విషయాన్ని శ్రీలంక విద్యుత్ శాఖ మంత్రి కుమార జయకోడి తెలిపారు. ముఖ్యంగా ఒక కోతి తమ గ్రిడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిందని.. దాని వల్లే వ్యవస్థలో అసమతుల్యత ఏర్పడి దేశ వ్యాప్తంగా కరెంట్ కట్ అయిందని చెప్పుకొచ్చారు. ఈ విషయం విన్న ప్రజలు అంతా షాక్ అవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఒక్కొక్కరూ ఒక్కోలా కామెంట్లు చేస్తున్నారు.కొలంబోలోని ఒక సబ్ స్టేషన్‌లోకి ప్రవేశించిన కోతే.. దేశ వ్యాప్తంగా విద్యుత్ పోవడానికి కారణమా అంటూ ఓ నెటిజెన్ తన మనసులోని ప్రశ్నను అడిగాడు. అలాగే మరో వ్యక్తి.. ఒక కోతి=మొత్తం గందరగోళం అంటూ రాసుకొచ్చారు. శ్రీలంక జాతీయ విద్యుత్ గ్రిడ్ చాలా బలహీనమైన స్థితిలో ఉందని.. ఏ ఒక్క లైన్‌లో సమస్య ఏర్పడినా దేశ వ్యాప్తంగా విద్యుత్ స్తంభించిపోతుందని ఓ ఇంజినీర్ వివరించాడు. 2022లో ఆర్థిక సంక్షోభం సమయంలో శ్రీలంక విస్తృతంగా విద్యుత్ సరఫరాను కోల్పోయింది.

# రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీం సీరియస్.. కారణమిదే

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రజా ప్రతినిధుల కేసుల విచారణ వేగవంతంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని రాష్ట్రాలలో ఇంకా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయకపోవడంపైనా అసహనాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణను మార్చి4కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వాజ్యాన్ని అనుమతించి సుప్రీం కోర్టు ఈరోజు (సోమవారం) విచారణ చేపట్టింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్‌మోహన్‌ల ధర్మాసనం విచారణ జరిగింది.
చాలా రాష్ట్రాల్లో పరిస్థితి భిన్నం...అమికస్‌క్యూరీ విజయ్ అన్సారియా దాఖలు చేసిన స్టేటస్ నివేదికను ధర్మాసనం పరిశీలించింది. తన నివేదికలో పేర్కొన్న అనేక విషయాలను కోర్టుకు అమికస్‌క్యూరీ నివేదించింది. "42 మంది ప్రస్తుత లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. కొన్ని చోట్ల 30 ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఇప్పటికీ లేవు. మిగిలిన కేసులతో కలిపి విచారణ చేస్తున్నారు తప్ప... ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదు. దేశంలో ప్రజా ప్రతినిధుల కేసులు పెండింగ్‌లో ఉండటానికి ప్రత్యేకంగా విచారించే కోర్టులు లేకపోవడం ఒకటి. నిందితులుగా ఉన్న వారు ఏళ్ల తరబడి కోర్టుల్లో విచారణకు హాజరుకావడం లేదు.. ఇది మరో కారణం. సాక్షులకు ఏళ్ల తరబడి సమన్లు జారీ చేయడం లేదు, మరొకొన్ని అందించకపోవడం మరో కారణం. దేశంలో దాదాపు అన్ని చోట్ల ఇదే రకమైన పరిస్థితి ఉంది. ఢిల్లీ లాంటి చోట్ల ప్రత్యేక కోర్టులు ఈ కేసులు విచారిస్తున్నా.... చాలా రాష్ట్రాల్లో పరిస్థితి భిన్నంగా ఉందని" అమికస్‌క్యూరీ తెలిపారు.
అలా నిబంధనలు విధించాల్సిందే...హైకోర్టులకు ఈ కేసుల వివరాలపై నివేదిక కోరినా... సరిగా స్పందించక పోవడంతో అందుబాటులోకి వచ్చిన వివరాలతో నివేదిక అందించినట్లు అమికస్‌క్యూరీ పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు ఉంటే 4వ తరగతి ఉద్యోగిగా అనర్హులు అవుతారని కానీ ప్రజా ప్రతినిధులుగా ఎలా అని ధర్మాసనం ప్రశ్నించింది. చాలా మంది ప్రజాప్రతినిధులపై డ్రగ్స్, ఆహార కల్తీ, కిడ్నాప్ కేసులు కూడా ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వికాస్ సింగ్.. కోర్టుకు చెప్పారు. అలాంటి వారు ప్రజాప్రతినిధులుగా ఉండటానికి వీల్లేదని ప్రజాప్రాతినిధ్య చట్టం స్పష్టంగా చెపుతోందన్నారు. 46, 47 మంది ఎంపీలపై కిడ్నాప్ కేసులు కూడా ఉన్నాయని లాయర్ వికాస్ సింగ్ తెలిపారు. ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నేర చరిత్ర ఉన్న వారిని తమ కార్యవర్గంలో (ఆఫీస్ బేరర్‌గా కూడా) ఉంచకుండా ఈసీ నిబంధనలు విధించాలని అమికస్‌క్యూరీ కోరారు. ఇందుకు సంబంధించి ఈసీ మార్గదర్శకాలు ఉన్నాయని... వాటిని వెంటనే అమల్లోకి తీసుకురావాలని అమికస్‌క్యూరీ అన్నారు. అలా చేస్తే రాజకీయ పార్టీలను రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రించినట్లు అవుతుందని... అమలు చేయడంలో కొన్ని సమస్యలు వస్తాయి కదా అని జస్టిస్ మన్మోహన్ ప్రశ్నించారు.
న్యాయవాదుల అభిప్రాయాలు..నేర చరిత్ర గల వారిని నియంత్రించాలి అంటే ఇలాంటి నిబంధనలు కఠినంగా అమలు చేయాలని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఆఫీస్ బేరర్స్‌పై కూడా నియంత్రణ విధిస్తేనే కోర్టు తీర్పులపై ప్రజలకు గట్టి నమ్మకం ఏర్పడుతుందని న్యాయవాదులు చెప్పుకొచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను పలు హైకోర్టుల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులు వివరించారు. కొన్ని కేసుల్లో 200 మంది వరకు సాక్షులు ఉన్నారని... ఒకవేళ నిందితుడు ఎంపీనో, ఎమ్మెల్యేనో అయితే ఒకరే సాక్షి అవుతున్నారని సుప్రీం న్యాయస్థానానికి న్యాయవాదులు తెలిపారు. దోషిగా తేలిన వ్యక్తి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి ఆఫీస్ బేరర్‌గా ఉండగలరా అనేది ప్రశ్న అని ఒక న్యాయవాది అన్నారు. . ఇవాళ చట్టం ప్రకారం వారు హత్య చేయవచ్చు.... కానీ అతను జాతీయ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి ఛైర్మన్‌గా ఉండవచ్చా అనేది కీలకంగా పరిగణించాల్సిన అంశం అన్నారు న్యాయవాది.అన్నింటినీ పరిగణలోకి తీసుకుంటామన్న సుప్రీం..ప్రతిఒక్కరి వాదనను తాము పరిగణనలోకి తీసుకుంటామని ఒక న్యాయవాది లేవనెత్తిన్న అభ్యంతరాన్ని ధర్మాసనం తోసిపుచ్చింది. అన్ని రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వ వాదనలు కూడా వినాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. పీఎంఎల్ఏ, ఎన్ఐఏ కేసులు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులపై కేసులు కూడా ఆలస్యం చేస్తున్నారని మరో న్యాయవాది.. కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అందరి వాదనలు పరిగణనలోకి తీసుకోవడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ ఆ కారణంగా ఈ వ్యవహారంలో తుది తీర్పు ఆలస్యం కాకుండా ఉండాలన్నదే తమ లక్ష్యం అని పిటిషనర్ తరపు న్యాయవాది వికాస్ సింగ్ తెలిపారు. పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయని.. కానీ ఎంపీ, ఎమ్మెల్యేలపై కొన్ని ఉండటంతో అవి ప్రజాప్రతినిధుల కోర్టుకు వెళుతున్నాయని సుప్రీంకోర్టు దృష్టికి మరో న్యాయవాది తీసుకొచ్చారు.

## ఆప్, కేజ్రీవాల్ ఓటమికి ప్రధాన కారణం అదే.. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు






**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జన్ సురాజ్ పార్టీ అధినేత, పోల్ స్ట్రాటజిస్ట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోరంగా ఓడిపోవడానికి కారణాలు చెప్పారు. అదే సమయంలో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పరాజయం వెనుక ఉన్న కారణం కూడా వెల్లడించారు. గతేడాది ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయిన సమయంలోనే ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉండాల్సింది అని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయన సీఎం పదవికి రాజీనామా చేయడం.. ఆప్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువగా చేసిందని ప్రశాంత్ కిషోర్ చెప్పుకొచ్చారు. బెయిల్ వచ్చిన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయడం ఆయన చేసిన అతి పెద్ద తప్పు అని వెల్లడించారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి మొదటి కారణం గత 10 ఏళ్ల పాటు అధికారంలో ఉండగా.. ప్రభుత్వ వ్యతిరేకతనే అని చెప్పారు. ఇక రెండో కారణం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా అని ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయినపుడు ఆయన పదవి నుంచి తప్పుకుని ఉండాల్సిందని చెప్పారు. అయితే బెయిల్ పొందిన తర్వాత రాజీనామా చేయడం.. ఎన్నికలకు ముందు ఆతిశీని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టడం పెద్ద వ్యూహాత్మక తప్పిదమే అయ్యిందని వెల్లడించారు.
అంతేకాకుండా ఇటీవలి కాలంలో అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ వైఖరి కూడా మారిందని.. దేశంలో ప్రతిపక్ష కూటమిగా ఉన్న ఇండియాపై ఆయన నిర్ణయాలు కూడా ఆప్‌ను కొంత వరకు దెబ్బతీశాయని చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమితో కాకుండా ఒంటరిగా పోటీ చేయడంతో అది ఆప్ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. కేజ్రీవాల్ పరిపాలనలోని లోపాలను ఢిల్లీ ప్రజలు ఎత్తి చూపినా ఆప్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో ఇక ఆప్ తన రాజకీయ ఆధిపత్యాన్ని తిరిగి పొందడం కష్టమేనని చెప్పారు. ఇక చాలా కష్టపడితే కానీ.. అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో 15 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 12 ఏళ్ల ఆప్ పాలన అనంతరం.. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ గడ్డపై కాషాయ పార్టీ జెండా ఎగిరింది. 70 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి 48 సీట్లు దక్కగా ఆప్ కేవలం 22 స్థానాలకే పరిమితమై అధికారాన్ని పోగొట్టుకుంది. ఇక ఒక్క స్థానంలో గెలవకుండా వరుసగా మూడోసారి కాంగ్రెస్ పార్టీ సున్నాకే పరిమితం అయింది.


## హైకోర్టు కేసులు వాయిదా పడేలా చేస్తున్న కుంభమేళా

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వెళ్తున్నారు. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం భక్తులు పోటెత్తుతుండగా.. రోడ్లన్నీ స్తంభించిపోయాయి. దాదాపు 60 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా.. భక్తులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కేవలం కుంభమేళాకు వెళ్లే వాళ్లే కాకుండా సామాన్య ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అలహాబాద్ హైకోర్టులోని కేసులన్నీ పెండింగ్‌లో పడ్డాయి. దీనికి గల కారణం ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా జనవరి 13వ తేదీన ప్రారంభం కాగా.. పెద్ద ఎత్తున భక్తులు అక్కడకు వెళ్తున్నారు. విదేశాల నుంచి సైతం ప్రముఖులు వస్తూ.. త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. ఈక్రమంలోనే ప్రయాగ్ రాజ్ వెళ్లే మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. ముఖ్యంగా వారం రోజుల నుంచి అయితే 200 నుంచి 300 కిలో మీటర్ల మేర ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. 50 కిలో మీటర్లు ప్రయాణించేందుకు 10 నుంచి 12 గంటల సమయం పడుతుంది. 45 రోజుల పాటు సాగే ఈ మహా కుంభమేళా జనవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. అప్పటి వరకు ప్రజలకు ట్రాపిక్ సమస్యలు తప్పేలా లేవు.అయితే ఈ ట్రాఫిక్ సమస్యల వల్లే ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో కేసులన్నీ గత కొన్ని వారాలుగా పెండింగ్‌లో పడుతున్నాయి. రద్దీ వల్ల పిటిషన్ దారులు, లాయర్లు సమయానికి కోర్టుకు హాజరు కాలేకపోతున్నారు. దీంతో చేసేదేమీ లేక ఆ కేసులను వాయిదా వేస్తున్నారు. ముఖ్యంగా ఈరోజు ఆల్ట్ న్యూస్ జర్నలిస్ట్, ఫ్యాక్ట్ చెకర్ మొహమ్మద్ జుబేర్ ఓ పిటిషన్ వేశారు. ఘజియాబాద్ దస్నా దేవి ఆలయం కేసులో నమోదు అయిన క్రిమనల్ కేసును కొట్టివేయాలంటూ న్యాయస్థానాన్ని విన్నవించారు.ఈ పిటిషన్‌పై ఈరోజు అలహాబాద్ హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ కుంభమేళా ట్రాఫిక్ కారణంగా పిటిషనర్లు కోర్టుకు హాజురు కాలేకపోయారు. దీంతో చేసేదేమీ లేక జస్టిస్ సిద్దార్థ్ వర్మ, జస్టిస్ యోగేంద్ర కుమార్ శ్రీవాత్సవ్ కేసును వాయిదా వేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనల వల్ల ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. ఈ కారణం వల్లే ఇరు పార్టీలకు చందిన వాళ్లు హాజరు కాలేకపోయారని స్పష్టం చేశారు. దీని కారణంగానే జుబేర్‌కు ఫిబ్రవరి 17వ తేదీ వరకు అరెస్టు నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది.



## తీవ్ర విషాదం.. పెళ్లి వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన యువతి..





**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లి వేడుకల్లో భాగంగా సంగీత్‌లో డ్యాన్స్ చేస్తూ ఓ యువతి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో అప్పటి వరకూ ఎంతో సంతోషంగా కళకళలాడుతోన్న ఆ ఇంట విషాదం నెలకుంది. ఊహించని విధంగా గుండెపోటుతో ఆ యువతి ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లోని విదిశా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. చెందిన పరిణీత జైన్ (23).. శనివారం విదిశాలో జరుగుతోన్న తన కజిన్ సిస్టర్ వివాహానికి హాజరైంది. అక్కడ సంగీత్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంది. ఈ క్రమంలో ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా.. హఠాత్తుగా స్టేజ్‌పైనే ఆమె కుప్పకూలి పడిపో యింది.దీంతో అక్కడ బంధువుల్లో వైద్యులు ఉండగా.. వారు ఆమెకు సీపీఆర్ చేశారు. అయినప్పటికీ వారి ప్రయత్నం ఫలించకపోవడంతో హుటాహుటిన సమీపంలో ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే సమయం మించిపోయింది. గుండెపోటుకు గురైన పరిణీత జైన్.. మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరిం చారు. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. యువతి మృతితో పెళ్లింట విషాదఛాయలు అలముకున్నాయి. కాగా, పరిణీతి సోదరుడు కూడా ఇలాగే చనిపోవడం బాధాకరం. అతడు 12 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇది జరిగిన కొన్నాళ్ల తర్వాత సోదరుడిలాగే పరిణీతి కూడా హార్ట్‌ఎటాక్‌తో మృతిచెందడం తల్లిదండ్రులు వేదన వర్ణనాతీతం. ఎంబీఏ పూర్తిచేసిన పరిణీతకు త్వరలోనే తల్లిదండ్రులు వివాహం చేయాలని భావించారు. కానీ, అంతలోనే ఈ విషాదం చోటుచేసుకుంది.ఆమె డ్యాన్స్ చేస్తూ వేదికపై కుప్పకూలిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. కోవిడ్ 19 వ్యాప్తి తర్వాత తరుచుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, కరోనా టీకాల వల్లే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. అయితే, వైద్యులు మాత్రం వీటిని తోసిపుచ్చుతున్నారు. గుండెపోటు మరణాల వెనుక జీవనశైలి, కుటుంబ నేపథ్యం వంటి కారకాలు కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. కరోనా వైరస్ మహమ్మారి వెలుగులోకి వచ్చినప్పటి నుంచి చిన్నారులు సైతం గుండెపోటుకు గురికావడంతో వ్యాక్సిన్లపై అనేక అపోహలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, కోవిడ్-19 టీకాలతో గుండెపోటుకు ఎటువంటి సంబంధం లేదని ఐసీఎంఆర్ అధ్యయనం నిర్ధారించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
11 । ఫిబ్రవరి । 2025





## ఢిల్లీ విజయంలో ఒకే ఒక్కడు.. మోదీని మించి..



న్యూఢిల్లీ-నవభూమి:ప్రస్తుతం బీజేపీలో నరేంద్ర మోదీ, అమిత్ షా తిరుగులేని నాయకులు.. వీరి వ్యూహాలను తట్టుకుని నిలబడటం సాధ్యమయ్యే పనికాదు. ఎక్కడ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించడంలో వీరిని మించినవారు లేరని కొందరు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దేశంలో బీజేపీ బలంగా లేని ప్రాంతాల్లో ఆ పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతుందంటే దానికి ప్రధాన కారణం మోదీ, అమిత్ షా వ్యూహాలే. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఢిల్లీలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే వీరిద్దరి ఆకాంక్ష నెరవేరలేదు. ఆప్ ముందు వీరి వ్యూహాలు రెండు సార్లు పనిచేయలేదు. మోదీ, అమిత్ షాలకు సాధ్యం కాని లక్ష్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు ఢిల్లీకి చెందిన ఓ బీజేపీ నేత. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీలో 48 స్థానాల్లో గెలుపొందిన బీజేపీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఢిల్లీలో ఎంతో బలమైన ఆప్ వంటి పార్టీని ఎదుర్కొని, బీజేపీకి ఘన విజయం అందించడంలో ఓ వ్యక్తి పాత్రను తప్పకుండా ప్రస్తావించాల్సిందే. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు.. బీజేపీ విజయానికి ఎలా కారణమయ్యారో తెలుసుకుందాం.ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దెదించి.. తాము అధికారం చేపట్టాలనే బీజేపీ ప్రయత్నం రెండుసార్లు ఫలించలేదు. అయినప్పటికీ ఆప్‌పై బీజేపీ తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. అరవింద్ కేజ్రీవాల్ సైతం కేంద్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు. ఆప్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. మరోవైపు సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకోవడంతో.. ఆ వర్గాలు కేజ్రీవాల్‌కు బలమైన ఓటుబ్యాంకుగా మారింది.

## చిక్కుల్లో ఆర్థికం...!

దేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలతో పోల్చితే కొంత చిక్కుల్లో ఉన్నదన్న విషయం శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. మన ఆర్థిక వృద్ధిరేటు ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటితో పోల్చితే బలంగానే ఉన్నప్పటికీ దేశీయంగాను, అంతర్జాతీయంగాను పలు సవాళ్లు రాబోయే కాలంలో ఆ జోరుకు పగ్గాలు వేయవచ్చునన్న సంకేతాలు వెలువరించింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యం నెరవేరాలంటే ఈ వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. ఏడాదికి సగటున ఎనిమిది శాతం వృద్ధిని సాధిస్తే తప్ప మనం ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు.

గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం వల్ల ఎగుమతుల రంగం ఎదురీదుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా కేవలం 2 శాతం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతుల వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం అయింది. దీనికి తోడు కొత్తగా రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ఆత్మరక్షణ విధానాలకు పెద్ద పీట వేస్తున్నారు. దీని వల్ల అమెరికాకు ఎగుమతులు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఇవన్నీ విదేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లయితే దేశీయంగా ద్రవ్యోల్బణం పెనుభూతంగా ఉంది. గత ఏడాది రుతుపవనాల సానుకూలత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొనుగోలుశక్తి పెరిగినప్పటికీ నగర జీవులు మాత్రం ధరల కాటుకు విలవిలలాడుతూనే ఉన్నారు. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోయింది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని తట్టుకోగల రీతిలో వారి వేతనాలు పెరగడంలేదు. ఈ అస్థిరతల నుంచి బయటపడి నిలకడ వృద్ధిరేటు సాధించాలంటే భిన్న రంగాల్లో సంస్కరణలు చేపట్టక తప్పదన్న విషయం ఆర్థిక సర్వే నివేదికలో తేల్చి చెప్పారు. దేశీయంగా వృద్ధికి ఊతం ఇచ్చే రంగాలను ఉత్తేజితం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వాణిజ్యం, ఎగుమతులు, పారిశ్రామిక రంగాల విషయంలో నియంత్రణలు సడలించడం, సుంకాలు హేతుబద్ధం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నది ఆర్థిక సర్వే సారాంశం. దేశంలో ఉపాధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ఎంఎస్ఎంఈ రంగమే. ఈ రంగంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మితిమీరిన నియంత్రణలను సడలించి పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని సర్వేలో సూచించారు. అలాగే దేశంలో ఇప్పటికీ పప్పుదినుసులు, వంటనూనెల కొరత అధికంగా ఉంది. ఆ కొరతను అధిగమించేందుకు ఇప్పటికీ భారీ పరిమాణంలో వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. అవసరాన్ని మించి తృణ ధాన్యాలు ఉత్పత్తి చేయడాన్ని నిలువరించి పప్పులు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం అవసరమన్న విషయం సర్వే తేల్చి చెప్పింది. ఒకపక్క మార్కెట్ ధరల్లో ఆటుపోట్ల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కావడంతో పాటు మరోపక్క సాధారణ గృహస్థులకు రక్షణ కల్పించే సమాంతర వ్యవస్థ ఒకటి ఉండాలని సూచించింది. ఇక ఎగుమతులు ఉత్తేజితం చేయాలంటే వాణిజ్య సంబంధిత వ్యయాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. అప్పుడే భారత్ పోటీ సామర్థ్యం పెంచుకోగలుగుతుంది. ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావాలంటే మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పెరగాలని, కంపెనీలు వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవడం అవసరమన్న విషయం నాగేశ్వరన్ ఒక చక్కని ఉదాహరణ ద్వారా చెప్పారు. వేతనాల్లో అరకొర వృద్ధి ఉన్నట్టయితే తాను ఉత్పత్తి చేస్తున్న కార్లు అమ్ముడుపోవని ఫోర్డ్ మోటార్ కంపెనీ వ్యవస్థాపకుడు హెన్రీ ఫోర్డ్ గుర్తించారని వ్యాఖ్యానించడం ద్వారా కార్పొరేట్లు లాభాలు మూటగట్టుకుంటే సరిపోదని, దాన్ని ఉద్యోగులకు కూడా వేతన వృద్ధి రూపంలో పంచినప్పుడే ఆర్థిక వృద్ధికి దోహదకారులవుతారని ఆయన స్పష్టంగా సూచించారు. మొత్తం మీద ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడి దేశం స్థిరమైన వృద్ధిరేటు సాధించే దిశగా అడుగేయాలంటే సంస్కరణలను ఆశ్రయించక తప్పదు. ఒక పక్క వ్యయాలను నియంత్రించుకుంటూ మరోపక్క స్థిరమైన వృద్ధిని కొనసాగించడం ద్వారా వికసిత్ భారత్‌కు బాటలు వేయడం అనేది కత్తిమీద సాము అనక తప్పదు. ఆర్థిక సర్వేలో సూచించిన భిన్న మార్గాల్లో పయనిస్తూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేటి బడ్జెట్లో ఏ విధమైన బాటలు వేస్తారన్నది వేచి చూడాలి.

# వారిని కాదనుకుంటే కష్టమే!

కల్తీ లేని పాలు కావాలనుకునేవాళ్లు గేదెలను పెంచేవారి నుంచి నేరుగా కొంటూ ఉంటారు. అమెరికాలోనూ గేదెలను పెంచే డెయిరీ ఫార్మ్ వద్దకు వెళ్లి తెచ్చుకోవచ్చు. ఇక్కడ మొన్నమొన్నటిదాకా ఒక గ్యాలను (మూడున్నర లీటర్లకంటె కాస్త ఎక్కువ) పాల ధర 8-9 డాలర్లు ఉండేది. తరువాత, అది 15 డాలర్లు అయింది. మరువారానికి 18 డాలర్లకు చేరుకుంది. హఠాత్తుగా ధర రెట్టింపు అయిందేమిటని కుతూహలం కొద్దీ అతడిని అడిగాను. 'ఇప్పుడు వాళ్లు పనికి రావడం లేదు. స్థానికులతోనే చేయించాల్సి వస్తోంది' అన్నాడు. 'వాళ్లు' అంటే%-% ట్రంప్ ప్రభుత్వం ఎవరినైతే 'డిపోర్ట్' చేసేస్తున్నదో వాళ్లన్నమాట. 'స్థానికులు' అంటే అమెరికన్లే!. అక్రమ వలసదారులందరినీ 'డిపోర్ట్' చేయడం.. అమెరికాను ఖాళీ చేయించడం అనే మాటలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ, ఆ నిర్ణయం పర్యవసానాలు అమెరికాలోని ప్రజాజీవితం మీద భవిష్యత్తులో ఎలాంటి ప్రభావం చూపిస్తాయో అర్థం చేసుకోవడానికి ఇది చిన్న ఉదాహరణ.

అక్రమ వలసదారులు' అనే పదం ద్వారా వారి గురించి దురభిప్రాయాన్ని సృష్టించడం చాలా సులువు. కానీ అమెరికన్ శ్రామిక వ్యవస్థలో అట్టడుగు స్థాయిలో ఉన్న వీరిని ఆ స్థానంనుంచి తొలగించడమంటే ఏకంగా ఆ వ్యవస్థను కుప్పకూల్చేయడమే. ఇందుకు అమెరికా అనేక రకాల విపరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఉత్పాదనల ధరలు అమాంతం పెరిగి, అంతిమంగా అమెరికన్లలో అసహనానికి దారితీయవచ్చు. అమెరికాలో చిన్నచిన్న ఉద్యోగాల్లో ఇలాంటివారే ఉంటారు. కెనడా, మెక్సికో తదితర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం సరిహద్దు దాటి పెద్దసంఖ్యలో వచ్చేస్తుంటారు. ఆ రెండు దేశాలు మాత్రమే కాదు. మెక్సికోలోకి సులువుగా ప్రవేశించగల భూమార్గాలు ఉన్న గ్వాటిమాలా,ఎల్ సాల్వడార్ తదితర దక్షిణ అమెరికా దేశాలకు చెందినవారు కూడా తొలుత మెక్సికోలోకి, తర్వాత మంచి అవకాశం చూసుకుని




అమెరికాలోకి నడుచుకుంటూ వచ్చేస్తుంటారు. ఈ అక్రమ వలసదారులనే కేటగిరీలో భారతీయులు కూడా అత్యధికంగానే ఉన్నారు. పంజాబ్, గుజరాత్‌లకు చెందిన అనేకమంది తొలుత మెక్సికోకు వెళ్లి అక్కడి నుంచి అమెరికాలోకి వస్తారు. తర్వాతి స్థానం తెలుగువారిదే. తనిఖీల కన్నుగప్పగల తెలివితేటలు, చాకచక్యం ఉన్నవారు నేరుగా వచ్చేయగలరు. మెక్సికోలో సరిహద్దు దాటించి అమెరికాలోకి పంపడానికి కొన్ని ముఠాలు కూడా పనిచేస్తుంటాయి. వీళ్లందరూ పొట్ట చేతబట్టుకుని కడుపుకూటి కోసం తరలివచ్చేవాళ్లు. పిల్లాపాపలతో వందల కిలోమీటర్లు వచ్చేస్తారు. బెదిరించిన వారికి తృణమో పణమో సమర్పించుకుని వస్తారు, గుట్టుచప్పుడు కాని బతుకులే బతుకుతూ ఉంటారు. వ్యవసాయ పనుల్లో, డెయిరీ ఫార్మ్‌లలో, భవన నిర్మాణ కార్మికులుగా, ఆతిథ్య, సేవారంగాల్లో అతి తక్కువ కూలికి వీరు పనిచేస్తుంటారు. ల్యాండ్ స్కేపింగ్, రవాణా, వేర్ హౌసింగ్, చైల్డ్ కేర్, ఇంటి పనులు వంటి వాటిల్లో కూడా వీరి సేవలు అధికం. ఈ రంగాలన్నీ మానవ వనరులు విస్తృతంగా అవసరమయ్యేవి. ఇవి తరచూ కూలీల కొరతతో ఇబ్బంది పడుతుంటాయి. ఈ రంగాలు స్థిరంగా కొనసాగడంలో ఈ అన్‌డాక్యుమెంటెడ్ లాటినో వర్కర్స్‌గా పరిగణనలో ఉండేవారి భాగస్వామ్యమే ఎక్కువ.దాదాపు 90 శాతం హోటళ్లలో, ఇతరత్రా తక్కువ వేతనాలు ఇవ్వజూపే వృత్తుల్లో వీరే ఉంటారు. గంటల వంతున చెల్లించే వేతనాలను తక్కువ మొత్తాల్లో ఇస్తూ, వీరి నుంచి నాణ్యమైన పనిని పొందడం ఆయా వ్యాపారాల యజమానులకు సాధ్యమవుతుంది. వేతనాలకు సంబంధించి వారి నుంచి అతిగా డిమాండ్లు ఉండవు. అలాగే ఒళ్ళు దాచుకోకుండా శ్రద్ధగా పనిచేస్తారని పేరుంది. అలాగే అన్ని రకాల చిల్లర పనులు చేస్తూ, నిత్యం అందుబాటులో ఉండే వారిని అమెరికాలో 'హ్యాండీ మెన్' అని వ్యవహరిస్తారు. వీరు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, గార్డెనింగ్, క్లీనింగ్ తదితర సకల డొమెస్టిక్ పనులకు గంటల వారీ వేతనానికి అందుబాటులో ఉంటారు. ఈ హ్యాండీ మెన్‌లుగా పనులు చేసేవాళ్లలో అత్యధికులు ఈ వర్గానికి చెందినవారే. వారిని దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టడం అంటూ జరిగితే అమెరికాలో చిరువ్యాపారాలు, వ్యవసాయ రంగాల రూపురేఖలు మారిపోతాయి. వారి స్థానంలో అమెరికన్లనే నియమించుకోవాల్సి వస్తే, ప్రతి పనికీ ఆ వ్యాపార యజమాని గతంలో ఇస్తున్న వేతనం కంటే కనీసం రెట్టింపు చెల్లించాల్సి వస్తుంది. దీని ప్రభావం ఉత్పత్తుల ధరల మీద పడుతుంది. అంతిమంగా నష్టం జరిగేది అమెరికన్ పౌరులకే. అమెరికాలోని సెంటర్ ఫర్ అమెరికన్ ప్రోగ్రెస్ ఎస్టిమేట్స్ వారి నివేదిక ప్రకారం ఈ ఇమిగ్రెంట్స్ అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా వందల బిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుస్తుంటారు. వారు చెల్లించే వివిధ రకాల పన్నులే కాదు, వీరిలో కొందరు సొంతంగా చిరువ్యాపారాలు కూడా ప్రారంభించి ఆర్థికవృద్ధిలో భాగం అవుతుంటారు.నేరచరిత్ర ఉన్నవారిని వెనక్కు పంపడాన్ని ఎవ్వరూ కాదనరు. కానీ స్వస్థలాలను, సొంత మనుషుల్ని వదులుకుని.. ఇక్కడ బతుకుతెరువు కోసం వచ్చిన అందరిమీద సమానంగా కక్ష కట్టడం విజ్ఞత కాదు. డెమోక్రాట్ల నుంచి మాత్రమే కాకుండా.. వీరి సేవలను వాడుకుంటున్న చిరు వ్యాపారులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు, ఉత్పాదక వర్గాల నుంచి కూడా ట్రంప్ నిర్ణయం పట్ల వ్యతిరేకత వెల్లువెత్తే అవకాశం ఉంది. ట్రంప్, విశాల దృక్పథంతో అమెరికన్ల జీవితాలపై పడే భారాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని, తన నిర్ణయాలను సమీక్షించుకోవాలి. డీపోర్టేషన్ జరుగుతున్న సమయంలో భారత్‌లో తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసే అనేక అర్థంపర్థంలేని సోషల్ మీడియా ప్రచారాలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ విద్యార్థులను తక్షణం వెనక్కు పంపాలనేంత దుర్మార్గమైన పోకడలు ప్రస్తుతానికైతే ఇక్కడ ఏమీ కనిపించడం లేదు. అక్రమంగా ఉంటున్నవారి మీదనే ఐస్ (ఐసీఈ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) దృష్టి ఉంటోంది. అమెరికా నుంచి అక్రమ వలసదారుల్ని డీపోర్ట్ చేయడం ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఐస్ నిరంతరాయంగా అదే పనిమీద ఉంటుంది. కాకపోతే, ఇప్పుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంచెం ఉధృతంగా జరుగుతోంది.

# లక్ష్యం కోసం లక్ష డప్పులు వేల గొంతుకల సభ



మాదిగల లక్ష్యసాధన కోసం "వేల గొంతుకలు లక్ష డప్పుల"మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయన్ని తెలుపుకొని ఎస్సీ, ఏబిసిడి వర్గీకరణ కోసం, గత 30 సంవత్సరాల నుండి వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగ ఉపకులాలకు సంబందించి ఇటీవల సుప్రీంకోర్టు, ఏబిసిడి వర్గీకరణ విషయంలో సానుకూలంగా తీర్పు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో వర్గీకరణ అమలు చేయాలని ప్రతి గ్రామంలో పల్లె పల్లెనా పల్లె నుండి పట్నం వరకు, మారుమూల ప్రాంతం నుండి మహానగరం వరకు మాదిగ దండోరా యాత్ర సాగుతుంది. మాదిగ వర్గీకరణ ఆకాంక్ష మూడు దశాబ్దాల పోరాటం దారి ఈ పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరులు కూడా ఎందరో ఉన్నారు. వర్గీకరణ సాధన లక్ష్యంగా ఏర్పడిన మాదిగ దండోరా,సమాజంలోని అన్ని వర్గాల మన్నలు పొందిన ఉద్యమాల ఊట,ఎమ్మార్పీఎస్ గా స్థిరపడింది. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు విషయంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, ఎస్సీ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం కేటగిరీలో రిజర్వేషన్లు విభజించాలని దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాల వారికి న్యాయం చేరాలని డిమాండ్ తో ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా,ఈదుముడిలో గ్రామం లో 13 మంది యువకులతో 1994 జులై 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించారు. మాదిగ దండోరా ఉద్యమంతో మందకృష్ణ మాదిగ, అనతి కాలంలో మాదిగలకు ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచారు. మాదిగల కోసం ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ప్రారంభించిన ఆయన. దివ్యాంగులు, వృద్ధులు, హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారుల గుండె ఆపరేషన్ కోసం, ఉద్యమాలు నిర్మించారు. పేద కుటుంబాలకు చెందిన హృద్రోగ బాధిత పిల్లలను ఆదుకోవాలంటూ పిల్లలతో కలిసి హైదరాబాదులో 2004లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి 2004






ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శిబిరాలను నిర్వహించింది. సుమారు 5,500 మంది గుండె జబ్బులతో పిల్లలను గుర్తించి వారికి ఉచిత చికిత్స అందించేందుకు నిర్ణయించింది.ఆ పోరాటం స్ఫూర్తిగానే నాటి సీఎం వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తెచ్చారన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. దివ్యాంగుల కోసం 2007లో మందకృష్ణ నిజాం కళాశాల మైదానంలో మహా గర్జన నిర్వహించారు. వృద్ధులు, వితంతువుల, తరపున మందకృష్ణ ఉద్యమాలు నిర్వహించారు. 2007లో మందకృష్ణ వికలాంగుల హక్కుల పోరాట సమితి, నెలకొల్పారు. దివ్యంగులకు ప్రతినెల పింఛన్లు ఇవ్వాలని రిజర్వేషన్లు అమలు చేయాలని ఉద్యమించారు. దీంతో వారికి ప్రభుత్వం పింఛన్ పథకాన్ని ప్రకటించింది. ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో వికలాంగులకు పింఛన్ లభిస్తుంది. ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడడంలో కూడా కీలక పాత్ర పోషించింది. సామాజిక సమస్యలపై ఉద్యమ పోరాటం చేస్తూ సామాజిక న్యాయం కోసం అనితర పోరాటయోధుడు, సామాజిక మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మాదిగ హక్కుల ఉద్యమమే మానవ హక్కుల ఉద్యమం అని నినదించిన నాయకుడు మందకృష్ణ మాదిగ, రాష్ట్ర ప్రభుత్వాలకు సామాజిక సమానత్వం కోసం ప్రశ్నిస్తూ సామాజిక సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగ, మాదిగ దండోరా ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తింపజేశారు. దండోరా ఉద్యమంతో 1997లో చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు, రామచంద్ర రాజు కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నివేదిక ఆధారంగా 2000 ఏప్రిల్ నుంచి,2004 నవంబర్ 4 వరకు ఎస్సీ వర్గీకరణ అమలు జరిగింది. దీనితో మంద కృష్ణ మాదిగ, మాదిగల కు ఒక బలమైన నాయకుడిగా పేరు పేరొందరు. 1994 ఎస్సీ వర్గీకరణ ఉద్యమం అనేక సామాజిక ఉద్యమలు చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో గత ఏడాది ఆగస్టు 1న 2024 సుప్రీంకోర్టు వెల్లడించిన అనుకూల తీర్పు వరకు ఎమ్మార్పీఎస్ కు 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగకు ఉద్యమ చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో వర్గీకరణ సాధకుడైన మందకృష్ణ, నాయకత్వంలో జరగబోవు "వేయి గొంతుకలు" లక్ష డప్పులు" అనే సభ నిర్వహణకు ఏర్పడిన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏపూరి సోమన్న, సారథ్యంలో హైదరాబాద్ గడ్డపైన ఫిబ్రవరి 7న జరుగుతున్న ఈ చారిత్రాత్మక సభకు సన్నాహాలు, ర్యాలీలతో తెలంగాణ కొరకు ఆడి పాడిన సబ్బండ వర్గాల కళాకారులు ఇమ్మతి తో గోసి / గొంగడి, కాలి గజ్జె డప్పులతో కలిసి తెలంగాణలో ప్రతి పల్లెని చుట్టనున్నారు. దండోరా ఎందుకు పుట్టిందోయ్,డప్పుందుకు గర్జన చేసిందోయ్, పోరుకు పయనం కట్టింది.అంటాడు మరొక వాగ్గేయకారుడు, పోలిశెట్టి లింగన్న, దండోరా సమాన హక్కుల కొరకు పయనమైన మానవ హక్కుల దండోరా వేసింది. సమాజానికి మేల్కొల్పు డప్పుపైన మాదిగ అస్థి త్వ దరువును మోగించింది. వర్గీకరణ సాధన త్వరితగతిన అమలు చేయాలని ఉద్దేశంతో ఫిబ్రవరి 7న హైదరాబాద్ నగరం నడిబొడ్డున" లక్ష డప్పులు వేయి గొంతుకలు" కవాతు చేయనున్నారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, న్యాయబద్ధ పోరాటమని సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నారు. ఎమ్మార్పీఎస్, 30 ఏళ్ల పోరాటానికి ప్రధాన మంత్రి మోడీ గత ఏడాది ఎన్నికలప్పుడు ఎమ్మార్పీఎస్ సభకు హాజరై వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. 30 సంవత్సరాల పోరాటం ఫలితంగా సుప్రీం కోర్ట్ ధర్మాసనం గత ఏడాది ఆగస్టులో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలవరించింది. అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాల మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. మందకృష్ణ మాదిగ పోరాట యోధుడికి పద్మశ్రీ పురస్కారం రావడం రాజకీయ ప్రముఖులు, బీసీల సంఘాల నాయకులు ఇతర సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేవులపల్లి రమేశ్,
సిద్దిపేట జిల్లా,
9963701294

# సమతుల్యత సాధించాలంటే...

భక్తి



భూమికి అక్షం ఉంటుంది. భూమి చలనం దాని మీద ఆధారపడి జరుగుతుంది. అదే విధంగా మానవుడిని సమతుల్య స్థితిలో ఉంచే అక్షం (ఇరుసు)... సూక్ష్మ నాడీ వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న సుషుమ్నా నాడి. ఇదే మనకు ఆధారం. ఇది మనలో మధ్యస్థంగా ఉండే నాడి. ఎవరిలో సుషుమ్నా నాడి సరైన రీతిలో ఉండదో... వారి శరీరంలోని వివిధ చక్రాలలో సమస్యలు, ఇబ్బందులు ఏర్పడతాయి.

భూమికి అక్షం ఉంటుంది. భూమి చలనం దాని మీద ఆధారపడి జరుగుతుంది. అదే విధంగా మానవుడిని సమతుల్య స్థితిలో ఉంచే అక్షం (ఇరుసు)... సూక్ష్మ నాడీ వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న సుషుమ్నా నాడి. ఇదే మనకు ఆధారం. ఇది మనలో మధ్యస్థంగా ఉండే నాడి. ఎవరిలో సుషుమ్నా నాడి సరైన రీతిలో ఉండదో... వారి శరీరంలోని వివిధ చక్రాలలో సమస్యలు, ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ ఇరుసు పరిధిని దాటి కుడి పార్శ్వం వైపు మొగ్గినప్పుడు... వ్యక్తి తన అహంకారంతో సమస్యలను సృష్టించుకుంటాడు. ఎడమ ఎడమ పార్శ్వం వైపు మొగ్గు చూపినప్పుడు.. తన వినాశనాన్ని కొని తెచ్చుకుంటాడు. సుషుమ్నా నాడిలో ప్రవహిస్తున్న శక్తి... ముప్పావు వంతు చుట్టుకున్న కాగితంలా ఉంటుంది. దాని లోపలే బ్రహ్మనాడి ఉంటుంది. ఈ బ్రహ్మనాడి మామూలుగా అయితే చాలా సన్నగా.. వెంట్రుక వాసిలో ఉంటుంది. అటువంటి సన్నని బ్రహ్మనాడిలోంచీ ఇంకా సన్నటి పోగులా ఉండే కుండలినీ శక్తి ఊర్ధ్వముఖంగా పయనిస్తుంది. ఈ పోగు బాగా సన్నగా ఉన్నవారు పైకి చూడడానికి గంభీరంగా, ధైర్యంగా తెలివైనవారుగా, మంచివారుగా కనిపిస్తారు. కానీ అంతర్గతంగా ఆధ్యాత్మికమైన లోతు ఉండదు. ఏ వ్యక్తయినా ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్ళగలిగినప్పుడు... అతని బ్రహ్మనాడి విశాలం అవుతుంది. దానిలో ప్రయాణించే కుండలినీ పోగులు కూడా వెడల్పుగానే ఉంటాయి. ఆధ్యాత్మికమైన లోతు ఉన్నవారికి వైఖరి చాలా సుందరంగా, మనోహరంగా ఉంటుంది. వారు అందరికీ ఆనందాన్ని పంచుతారు.

కాబట్టి మన సుషుమ్నా నాడిని దృఢంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ స్థితిని సాధించడానికి భక్తి శ్రద్ధలే అనువైన మార్గం. ముందు మీ జీవితం మీద మీకు శ్రద్ధ ఉండాలి. "ఈ జీవితంతో నేను ఏం చేస్తున్నాను? నేను జీవితాన్ని ఎలా వృధా చేస్తున్నాను? ఎందుకు వృధా చేస్తున్నాను? నా జీవితానికి పరమార్థం ఉండాలి కదా! ఆ పరమార్థాన్ని నేను నెరవేరుస్తున్నానా?" అనే ప్రశ్నలు మీరు వేసుకోవాలి. అప్పుడు మీ అహంకారంతో పోరాటం చేయడం చాలా సులువని మీరు అర్థమవుతుంది. ఎప్పుడయితే చిత్తం అంతర్గతంగా ప్రయాణం ప్రారంభిస్తుందో... అప్పుడు బ్రహ్మనాడి విస్తరించడం మొదలవుతుంది. ఆ తరువాత ఎలాంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి స్థితిలోనైనా, ఎటువంటి జీవన విధానంలోనైనా మీరు సౌకర్యంగా ఉండేలా చేస్తుంది. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేస్తున్నవారు ఈ స్థితిని సాధించగలరనీ, నిరంతర ధ్యాన సాధన ద్వారా ఈ స్థితిని సుస్థిరపరుచుకోగలరని శ్రీమాతాజీ నిర్మలాదేవి పలు సందర్భాలలో స్పష్టం చేశారు.

## ఆలుగడ్డలు నిల్వ ఉండాలంటే...



ఆలుగడ్డలను గాలి తగిలేలా ఉంచాలి. నేరుగా సూర్యకాంతి పడకుండా చూసుకోవాలి. ఎండ తగిలితే ఆకుపచ్చ రంగులోకి మారి చేదుగా అవుతాయి. చీకటి ప్రదేశాల్లో ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.తేమ తగిలితే ఆలుగడ్డలు తొందరగా పాడవుతాయి. వీటిని ఫ్రిజ్‌లో కూడా పెట్టకూడదు. చల్లదనం వల్ల వాటిలోని పిండిపదార్థం చక్కెరగా మారుతుంది. దీంతో అవి సహజ రుచిని కోల్పోతాయి.ఆలుగడ్డలను గోనె సంచులు, వెదురు బుట్టలు, కాగితం సంచుల్లో గాలి ఆడేలా నిల్వ చేయడం మంచిది. అలాకాకుండా ప్లాస్టిక్ కవర్లలో మూసి ఉంచితే మొలకలు వచ్చి తొందరగా పాడవుతాయి.

%ఆలుగడ్డలను టమాటాలు, నిమ్మకాయలు, ఉల్లిపాయలు, అరటిపండ్లతో కలిపి ఉంచకూడదు. వీటి నుంచి వెలువడే ఎథిలీన్ వాయువు వల్ల ఆలుగడ్డలపై పసుపు రంగు మొలకలు వచ్చేస్తాయి. ఇలా మొలకెత్తినవాటిలో శరీరానికి హాని కలిగించే గ్లైకోఆల్కలైట్ తయారవుతుంది.ఆలుగడ్డలను కొనేటప్పుడు గట్టిగా ఉన్నవాటినే తీసుకోవాలి. ఏమాత్రం మెత్తగా ఉన్నా అవి త్వరగా కుళ్లిపోతాయి.కొంతమంది ఆలుగడ్డలను కొన్నతరవాత వాటిపై మట్టి ఉందని నీళ్లలో నానబెట్టి కడిగేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆలుగడ్డలు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. వాటికి నీళ్ల తగలకుండా ఉంటే చాలా రోజులు తాజాగా ఉంటాయి.



# పకోడీలు వేసిన తర్వాత మిగిలిపోయిన నూనెతో ఇంట్లో ఒక్క బొద్దింక, ఎలుక కూడా ఉండదు, ఎలా వాడాలంటే







మనం ఇంట్లో పిండివంటలు, పూరీలు, పకోడీలు, బజ్జీలు చేసినప్పుడు కొంచెం నూనె మీగలడం కామన్. మిగిలిన నూనెను కొంతమంది కూరల తాలింపులకు వాడుతూ ఉంటారు. మరికొందరు వాడిన నూనె తిరిగి మళ్లీ వాడుతూ ఉంటారు. డీప్ ఫ్రైకు వాడిన నూనెను తిరిగి వాడితే.. ఆరోగ్యానికి హానిజరిగే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఈ నూనెను వాడకపోతేనే మంచిది. అలా అని చూస్తూ చూస్తూ పారేయడం ఎలా అనుకుంటున్నారా..? అయితే, నో టెన్షన్ ఈ నూనెను ఉపయోగించి కీటకాలు, ఎలుకలు, బొద్దింకల్ని తరిమికొట్టవచ్చు. ఈ చిట్కా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ నూనెను ఎన్ని విధాలుగా వాడవచ్చో ఇక్కడ తెలుసుకుందాం.

**బొద్దింకలు, కీటకాలతో డేంజర్**

ఇంట్లో బొద్దింకలు, కీటకాలు, ఎలుకలు కనిపిస్తే కంపరం పుడుతుంది. అంతేకాకుండా.. తినే తిండి, ప్లేట్లు, వంటగదిలో ఎక్కడాపడితే అక్కడ కనిపిస్తూ.. చికాకు పుట్టిస్తాయి. చాలా మంది బొద్దింకలు కనిపించినా పట్టించుకోరు. అయితే, బొద్దింకలు చాలా డేంజర్. ఇవి బ్యాక్టీరియా వ్యాప్తికి పనిచేస్తాయి. బొద్దింకలు బ్యాక్టీరియాను వంటపాత్రలు, కూరగాయలు, పండ్లపై వదిలిపెడతాయి. దీంతో.. వ్యాధులు వచ్చే ప్రమాదముంది. బొద్దింకలు చాలా కలుషితంగా ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. పురుగులు కూడా తినే ప్లేటు మీద కనిపిస్తాయి. ఇక, ఎలుకలు ఇంట్లోని వస్తువుల్ని పాడు చేస్తాయి. అందుకే వీటిని వదిలించుకోవాలి. వంటలు చేసిన తర్వాత మిగిలిన నూనెతో బొద్దింకల్ని తరిమికొట్టవచ్చు. ఎలాగంటే

**బొద్దింకల్ని ఎలా వదిలించుకోవాలి?**

మిగిలిన నూనెను ఉపయోగించి కీటకాలు, బొద్దింకల్ని వదిలించుకోవడానికి కిరోసిన్ కూడా అవసరం. ముందుగా, మిగిలిన నూనె తీసుకొని దానికి కొద్దిగా కిరోసిన్ కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని ఒక స్ప్రే బాటిల్‌లోకి తీసుకోండి. దీనిని ఇంటి మూలల్లో, తలుపుల దగ్గర, కీటకాలు, బొద్దింకలు వచ్చే ప్రదేశాలలో పిచికారీ చేయండి. ఈ మిశ్రమం కీటకాలు, బొద్దింకలు, ఎలుకలు, చీమలు ఇంట్లోకి రాకుండా చేస్తుంది. కిరోసిన్ కలవడం వల్ల నూనె ఘాటైన వాసనను కలిగి ఉంటుంది. ఈ వాసన దెబ్బకి అవి ఇంట్లో నుంచి పారిపోతాయి.

**పనిముట్లకు పాలిషింగ్ చేయవచ్చు**

వంటల్లో మిగిలిన నూనెను తోట పనిముట్లు, తలుపు హ్యాండిళ్లు లేదా చెక్క వస్తువులను పాలిష్ చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ముందుగా తేలికపాటి శుభ్రమైన గుడ్డను తీసుకోండి. నూనె గుడ్డకు అప్లై చేయండి. ఆ తర్వాత దుమ్ము, తుప్పు ఉన్న ప్రాంతాల్లో పాలిష్ చేయండి. ఇలా చేయడం వల్ల తుప్పు, దుమ్ము దూరమవుతాయి. చెక్క ఫర్నిచర్‌పై దీన్ని పూయడం వల్ల వాటి మెరుపు పెరుగుతుంది. మిగిలిన నూనె వృధాగా పారేసే బదులు ఇలా పాలిషింగ్ కోసం ఉపయోగించవచ్చు.

**గ్రీజు లేదా లూబ్రికెంట్‌లా వాడుకోవచ్చు**

పకోడీలు వేయించిన తర్వాత, పాన్‌లో మిగిలి ఉన్న నూనె తలుపుల క్రీక్ శబ్దాన్ని తొలగించడానికి సాయపడుతుంది. నిజానికి ఈ నూనె ఒక కందెన అంటే గ్రీజులాగా పనిచేస్తుంది. తలుపులు, కిటికీలు లేదా ఇతర యాంత్రిక పరికరాల జాయింట్స్‌కి దీన్ని పూయడం వల్ల ఘర్షణ తగ్గుతుంది. దీంతో, ఇలా చేయడం వల్ల పరికరాలు సున్నితంగా పనిచేస్తాయి.


**దీపం పెట్టుకోవచ్చు**

కాలం మారినప్పటికీ, నేటికీ చాలా ఇళ్లలో దీపాలు వెలిగిస్తూనే ఉన్నారు. ఈ దీపాలను ముఖ్యంగా ఇంటి అలంకరణలో ఉపయోగిస్తారు. ఇందుకోసం దీపాలను వెలిగించడానికి మిగిలిపోయిన నూనెను ఉపయోగించవచ్చు. దీనితో పాటు, అలంకార దీపాలలో కూడా నూనెను ఉపయోగించవచ్చు. మీరు మిగిలిన నూనెతో దీపాల్ని వెలిగించాలనుకుంటే దానిని ముందు ఫిల్టర్ చేయండి. ఆ

# ఇది త్యాగం కాదు... బాధ్యత

కల్నల్‌తో కాపురమంటే ఎడబాట్లు, త్యాగాలూ తప్పవు. నిరంతరం ప్రమాదాలతో చెలగాటాలూ తప్పవు. అయినా, ఆ వృత్తిని భర్తతో సమానంగా ప్రేమించడంతో పాటు, అటు కుటుంబానికీ, ఇటు నటనా జీవితానికీ సమ న్యాయం చేస్తున్నారు 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటించిన గాయత్రి భార్గవి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె 'నవ్య'తో పంచుకున్న జీవితానుభావాలివి...

మాది హైదరాబాదే! ప్రస్తుతం కుటుంబమంతా ఇక్కడే ఉంది. మాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద బాబు అక్షజ్ భావిక్‌కు 18 ఏళ్లు. చిన్న బాబు కృతిక్ భావిక్‌కు ఎనిమిదేళ్లు





.. పెళ్లయ్యే నాటికి డిగ్రీ వరకే చదివినా, పెళ్లి తర్వాత చదువును కొనసాగించి ఎమ్ఎ, ఎమ్ఫిల్ చేయగలిగాను. అదే సమయంలో టివిలో కూడా పని చేశాను. భోపాల్, అసోం, బెంగుళూరు... ఇలా విక్రమ్‌తో ఎక్కడకు వెళ్లినా ఆ ప్రాంతాల్లోని అనాథాశ్రమాలకు వెళ్లి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పేదాన్ని. ఆయన కూడా తన తీరిక సమయాల్లో పిల్లలకు గణితం బోధించేవారు.

'లక్కీ భాస్కర్'తో నాకు మంచి గుర్తింపు వచ్చింది. హీరోయిన్ మీనాక్షిది కూడా సైనిక కుటుంబమే! దాంతో మేమిద్దరం వెంటనే కలిసిపోయాం. సినిమా చివరివరకూ నేనెంతో ఎంజాయ్ చేశాను. మా అబ్బాయి దుల్కర్ సల్మాన్ అభిమాని. దాంతో షూటింగ్ సమయంలో మా వారు బాబును వెంటబెట్టుకుని సెట్‌కు వచ్చారు. ఆయనకు మా ప్రొడక్షన్ భోజనం తినిపించాం. ఆ వాతావరణాన్ని ఆయన చాలా బాగా ఎంజాయ్ చేశారు.

విక్రమ్ సుబ్రహ్మణ్యం... మావారు. ఆర్మీలో రెండో తరానికి చెందినవారు. మా మామయ్యగారు, ఆడపడుచు కూడా సైన్యంలో పని చేశారు. హిమనీనదాల దగ్గరకు వెళ్లిన తొలి బృందాల్లో మావారు కూడా ఉన్నారు. అప్పటివరకూ యుద్ధ సమయంలో తప్ప సైనికులెవరూ అక్కడకు వెళ్లేవారు కారు. పాకిస్తాన్, భారత్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో ఆరు నెలల గడపడం మొదలుపెట్టిన మొదటి బృందాలతో ఆయన కూడా వెళ్లారు. అప్పట్లో అక్కడ ఎలాంటి సదుపాయాలూ ఉండేవి కావు. ఉత్తరాలే ఏకైక కమ్యూనికేషన్. దాంతో మేమందరం ఆయనకు ఉత్తరాలు రాసేవాళ్లం. మేం రాసిన ఉత్తరం ఆయనకు చేరడానికి 15 రోజులు పడుతుంది. అయితే అప్పట్లో ఆయనకు నేనొక మంచి స్నేహితురాలిని మాత్రమే! చెన్నైలోని మా కజిన్ క్లాస్‌మేట్ ఆయన. అలా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఓ సందర్భంలో ఆయన హైదరాబాద్ వచ్చారు. విక్రమ్‌కు హైదరాబాద్‌లో స్నేహితులు లేరు కాబట్టి కంపెనీ ఇవ్వమని మా కజిన్ అడగడంతో ఒకట్రెండు సార్లు కలిశాను. అలా మా స్నేహం మరింత పెరిగింది. అది ప్రేమగా మారిందనే విషయం, కలిసి 'బార్డర్' సినిమాకు వెళ్లినప్పుడు తెలిసింది. సినిమాలో సైనికుల కష్టాలు చూసి నేను కళ్లనీళ్లు పెట్టుకుంటూ ఉంటే, ఆయనేమో పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. కానీ అప్పటికి నేనింకా చిన్నదాన్ని. ఇంట్లో ఒప్పుకోరని అభ్యంతరం చెప్పాను. ఆ తర్వాత చాలా కాలం పాటు మా మధ్య ఉత్తరాలు, ఫోన్ కాల్స్ కొనసాగాయి. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేసేనాటికి ఆయన ఒక కోర్సు కోసం హైదరాబాద్ ఈఎమ్ఇ సెంటర్‌కి వచ్చి ఇక్కడే మూడేళ్లు ఉండిపోయారు. ఆ సమయంలో పెద్దల అంగీకారంతో మేమిద్దరం 2004లో పెళ్లితో ఒక్కటయ్యాం.ఆ కొరతలు తప్పవు

సైనికుడి భార్యగా ఆయనతో నాకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాలి. సగటు మహిళల్లాగే భర్తతో కలిసి కుటుంబ వేడుకలు, పండుగలు జరుపుకోవాలని నేనూ ఆశపడుతూ ఉంటాను. కానీ అలా అన్నిసార్లూ సాధ్యపడేది కాదు. టూర్లూ, షికార్లూ వీలుపడేవి కావు. పిల్లల పుట్టినరోజులు కూడా ఆయన లేకుండా జరుపుకోవలసి వస్తూ ఉండేది. అయితే పెళ్లికి ముందే సైనికుల జీవితాల పట్ల కొంత అవగాహన ఉండడంతో నేనెప్పుడూ దాన్నొక కొరతగా భావించలేదు. దేశాన్ని కాపాడే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న విక్రమ్ అంటే నాకెంతో గౌరవం. ఆయన మాతో కలిసి ఉండే కొద్ది రోజులూ ఆనందంగా గడుపుతూ ఉంటాం. ఆయన అప్పుడప్పుడూ తన సైనిక అనుభవాలను నాతో పంచుకునేవారు. అయితే ముఖ్యమైన విషయాలే తప్ప తాను పాల్గొనే కొన్ని రహస్య మిషన్స్ గురించి చర్చించేవారు కారు. కొన్ని సందర్భాల్లో తనకెదురైన ప్రమాదకరమైన సంఘటల గురించి చాలా కాలం తర్వాత ఎంతో తాపీగా, యథాలాపంగా చెప్పేవారు. ఆయన చెప్తున్న విషయాలు విన్నప్పుడు గుండె ఝల్లుమనేది. ఓ సందర్భంలో హిమపాతం నుంచి తృటిలో తప్పించుకున్నాననీ, మరో సందర్భంలో చెవి పక్క నుంచి తుపాకీ గుండు దూసుకువెళ్లిందనీ నాతో చెప్పారు. ఇలాంటివి విన్నప్పుడు ఒక సగటు భార్యగా భయాందోళనకు లోనయ్యేదాన్ని.

**అదే చివరిసారి అనుకున్న సందర్భం**

సైనికుల భార్యల జీవితాలు తీగ మీద నడక చందం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఇక ఆయనను చూడడం ఇదే చివరిసారి అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పటికి మా పెళ్లై ఆరు నెలలు. ఓ రోజు అకస్మాత్తుగా సైన్యం నుంచి ఆయనకు పిలుపొచ్చింది. రాత్రికి రాత్రే సైనికులందరూ వెళ్లిపోయారు. వెళ్లినవాళ్లు ప్రాణాలతో తిరిగొస్తారనే నమ్మకం లేదు. పాస్‌పోర్టులు, బ్యాంక్ పాస్‌బుక్స్ చేతికి అందించి, తిరిగి రాకపోతే ఏం చేయాలో వివరిస్తుంటే విపరీతంగా భయపడిపోయాను. సినిమాల్లో తప్ప, నిజ జీవితంలో సైనికుల జీవితాలు ఎలా ఉంటాయో ఏమాత్రం అవగాహన లేని నేను గుండెలదురుతూనే ఆయనను సాగనంపాను. అయితే సినిమాల్లోలా సైనికులను ఏడుస్తూ సాగనంపే సన్నివేశాలు నిజ జీవితంలో ఉండవు. సంతోషంగా హారతిచ్చి, బొట్టు పెట్టి పంపిస్తాం. భయం, బాధ ఉన్నా, వాటిని మనసులోనే దాచుకుని దేశ ప్రజల భద్రత కోసం ప్రాణాలకు తెగిస్తున్న భర్తలను హుందాగా సాగనంపుతాం! వాళ్లు వెళ్లిపోయిన తర్వాత సైనికుల భార్యలుగా మేమందరం ఎంతో బాధ్యతగా నడుచుకుంటాం! పిల్లలూ, పెద్దల బాగోగులు చూసుకోవడంతో పాటు కంటోన్మెంట్లలోని జవాన్ల భార్యాపిల్లలను చూసుకోవలసిన బాధ్యత కూడా పైఅధికారుల భార్యలకు ఉంటుంది. కల్నల్ భార్యగా నేనలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాను. మేమందరం ఒకే కుటుంబంలా కలిసిమెలసి జీవిస్తూ ఉంటాం.


# ఫేస్ స్టీమింగ్ ఉపయోగిస్తున్నారా.. ఈ 5 తప్పులు చేయకండి..



అమ్మాయిలు అందంగా కనిపించడానికి చాలా రకాల ప్రయత్నాలు చేస్తారు. అందులో ఫేస్ స్టీమింగ్ ఒకటి. ఫేస్ స్టీమింగ్ ముఖ సంరక్షణకు ఒక గొప్ప పద్ధతి. ఇది చర్మాన్ని లోతుగా శుభ్రపరచడమే కాకుండా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ముఖానికి సహజమైన మెరుపును ఇస్తుంది. కానీ, ఫేస్ స్టీమింగ్ తప్పుగా చేస్తే అది ప్రయోజనానికి బదులుగా హాని కలిగిస్తుంది. తరచుగా ప్రజలు తమ ముఖానికి ఆవిరి పట్టేటప్పుడు కొన్ని సాధారణ తప్పులు చేస్తారు. దీని వలన చర్మం పొడిగా, ఎర్రగా లేదా చికాకుగా మారుతుంది. మీరు గ్లో కోసం ఫేస్ స్టీమింగ్ ఉపయోగిస్తే ఈ 5 తప్పులను నివారించండి.

**ఎక్కువసేపు ఆవిరి**

కొంతమంది ఎక్కువసేపు ఆవిరి పట్టడం వల్ల చర్మం మరింత మెరుస్తుందని అనుకుంటారు. కానీ, ఇలా చేయడం పెద్ద తప్పు. ఎక్కువసేపు ఆవిరిని వదులుతూ ఉండటం వల్ల చర్మంలోని సహజ తేమ తగ్గిపోతుంది. దీని వలన చర్మం పొడిబారడటమే కాకుండా ఎర్రగా మారుతుంది. అందువల్ల 5-10 నిమిషాల కంటే ఎక్కువసేపు ఫేస్ స్టీమింగ్ చేయకపోవడమే మంచిది.



**ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా**

మీరు మీ ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా నేరుగా ఆవిరి తీసుకుంటుంటే, అది మీ రంధ్రాలను మూసుకుపోయేలా చేస్తుంది. ఆవిరి పట్టే ముందు, ముఖం నుండి మురికి, మేకప్, నూనెను సరిగ్గా శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే చనిపోయిన చర్మం బ్యాక్టీరియా రంధ్రాలలోకి లోతుగా వెళ్తుంది. కాబట్టి ఆవిరి పట్టే ముందు మీ ముఖాన్ని తేలికపాటి క్లెన్సర్‌తో కడుక్కోవడం మంచిది.

**మరిగే నీటిని..**

నీరు ఆవిరి పట్టడానికి చాలా వేడిగా ఉంటే, అది మీ చర్మానికి హానికరం. చాలా వేడి ఆవిరి చర్మపు చికాకును కలిగిస్తుంది. అందువల్ల, నీటిని గోరువెచ్చగా ఉంచండి. బాగా మరిగే నీటిని ఉపయోగించవద్దు.

**రోజూ చేయడం**

ఫేస్ స్టీమింగ్ చర్మానికి మేలు చేస్తుంది, కానీ రోజూ చేయడం హానికరం. నిరంతరం ఆవిరి పట్టడం వల్ల చర్మంలోని సహజ నూనెలు తొలగిపోయి, చర్మం పొడిగా మరియు సున్నితంగా మారుతుంది. వారానికి 1-2 సార్లు మాత్రమే ఫేస్ స్టీమింగ్ చేయడం మంచిది.

**చల్లటి నీటితో..**

ఆవిరి పట్టిన తర్వాత చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. మీరు వాటిని సరిగ్గా చూసుకోకపోతే మురికి, బ్యాక్టీరియా మళ్ళీ లోపలికి ప్రవేశిస్తాయి. ముఖం మీద ఆవిరి పట్టిన తర్వాత వెంటనే ముఖాన్ని చల్లటి నీటితో కడుక్కోవడం, మాయిశ్చరైజర్ రాయడం అవసరం.

# ముత్యాలతో మురిపెంగా...

లాకెట్: తెల్లని సీజెడ్ రాయికి అంతకన్నా పెద్ద సైజు ముత్యాన్ని జోడించి లాకెట్‌లా రూపొందిస్తారు. దీనిని సన్నని బంగారు గొలుసుకి అమరుస్తారు. ఈ ముత్యం గొలుసు మెడ వరకు వస్తుంది. అన్ని రకాల దుస్తుల మీద చక్కగా అమరుతుంది. టీషర్ట్, జీన్స్ లాంటి మోడరన్ దుస్తులు ధరించే యువతులకు బాగుంటుంది.

**బ్రాస్‌లెట్:** అంత చిన్నవి కాకుండా కొద్దిగా పెద్ద ముత్యాలను మందపాటి దారంతో కూర్చి బ్రాస్‌లెట్‌ను తయారు చేస్తారు. ఈ ముత్యాల బ్రాస్‌లెట్‌ను చేతికి పెట్టుకుంటే ధరించిన డ్రెస్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నేవీ బ్లూ, ముదురు గులాబీ, లావెండర్ రంగు దుస్తుల మీద హుందాగా ఉంటుంది. దీనిని ఉద్యోగినులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు.

ఉంగరం: శ్వేత వర్ణంలో మెరిసే ముత్యాన్ని బంగారు ఉంగరంలో అమరుస్తారు. ఈ ముత్యపు ఉంగరం సంప్రదాయ దుస్తులతోపాటు ఆధునిక దుస్తుల మీద కూడా రాయల్‌గా కనిపిస్తుంది. కాలేజీ యువతులనుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఈ ఉంగరాన్ని ఎంపిక చేసుకుంటున్నారు.

కమ్మలు: ముత్యాలతో రూపొందించిన వివిధ రకాల డ్రాప్స్, స్టడ్స్, హూప్స్, రింగ్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగినులతోపాటు గృహిణులు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు వీటిని పెట్టుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఎలాంటి ముఖాకృతికైనా ఈ ముత్యాల కమ్మలు సొగసును అందిస్తాయి.









## దొంగ భక్తుల పంగనామం - బంగారు గొలుసుపోయి పూజారి ఆగమాగం..!



**మచిలీపట్నం-నవభూమి:**' మీ ఒంటిపై బంగారాన్ని తాకితే కలిసొస్తుంది.. కాస్త ఆ మెడలో బంగారాన్ని ఇలా చేతికివ్వండి పూజారి గారూ అని ఇద్దరు భక్తితో అడిగారు- అవునా అంటూ ఆనందంగా ఇదిగోండి నాయనా.. అని ఆ పూజారి తన మెడలో ఉన్న బంగారు గొలుసును వారి చేతికిచ్చాడు.. ఇంకేముంది.. అంతే.. రక్కున అక్కడి నుండి బైక్ పై ఆ ఇద్దరూ ఉడాయించాడు ' ఆ పూజారి లబోదిబోమన్నాడు. ఈ ఘటన ఆదివారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జరిగింది. మచిలీపట్నం గొడుగు పేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకునిగా పూజారి పనిచేస్తున్నారు. యథాప్రకారం ఈరోజు కూడా స్వామివారికి పూజ చేస్తుండగా ఆలయంలోకి ఇద్దరు దొంగ భక్తులు వచ్చారు. ఆలయం బయటికి వచ్చి ఆశీర్వదించాలని పూజారిని కోరారు. ఆలయం గోపురం వద్దకు వెళ్లి ఆ ఇద్దరినీ పూజారి ఆశీర్వదించారు. ఆశీర్వచనం అందించిన అనంతరం పూజారి మెడలోని బంగారు గొలుసును తాకుతానంటూ %"% ఆ ఇద్దరు భక్తులూ కోరారు. పూజారుల ఒంటిపై బంగారాన్ని తాకితే తమకు కలిసొస్తుందని పూజారిని నమ్మించారు. అలాగేనంటూ మెడలోని బంగారపు గొలుసును తీసి ఆ పూజారి ఆ ఇద్దరికి ఇచ్చాడు. గొలుసును కళ్ళకు అద్దుకొని బైక్ పై అక్కడి నుండి ఆ ఇద్దరూ ఉడాయించారు. ఈ విషయం తెలుసుకుని ఆలయం వద్దకు ఇనకుదురుపేట పోలీసులు చేరుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## త్వరలో మార్కెట్లోకి బజాజ్ ఈ-రిక్షా విడుదల



**న్యూఢిల్లీ-నవభూమి:** బజాజ్ ఆటో మార్చి చివరి నాటికి ఈ-రిక్షా విభాగంలోకి ప్రవేశిస్తోంది. నెలకి 45,000 యూనిట్ల పరిమాణం గల ఈ మార్కెట్ ప్రస్తుతం అత్యంత అవ్యవస్థీకృతంగా ఉందని, మార్చి త్రైమాసికం ముగిసేలోగా నియంత్రణాపరమైన అనుమతులు తీసుకోవాలని చూస్తున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. అను మతులు రాగానే "ఈ-రిక్" మోడల్ విడుదల చేయాలని భావిస్తున్నామన్నారు. ఏప్రిల్ తొలివారం నుంచి అమ్మకాలు ప్రారంభించాలన్నది తమ ఆలోచన అని తెలిపారు.

## అమర రాజా లాభంలో 11 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ-నవభూమి:**అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ.. డిసెంబరుతో ముగిసి న త్రైమాసిక లాభంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,272.47 కోట్ల ఆదాయంపై రూ.298.37 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.267.89 కోట్లు)తో పోల్చితే లాభం 11 శాతం వృద్ధి చెందింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను రూ.9,786.25 కోట్ల ఆదాయంపై రూ.783.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన అమర రాజా ఎనర్జీ డిసెంబరు త్రైమాసికంలో రూ.3,164.02 కోట్ల ఆదాయంపై రూ.311.83 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

## బీఎస్ఎన్ఎల్ 4జీ కోసం అదనంగా రూ.6,000 కోట్లు!

BSNL

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)కు అదనంగా రూ.6,000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ తన 4జీ కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గా లు వెల్లడించాయి. గత శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ భేటీలో ఈ అంశం ప్రధాన అజెండాగా ఉందని, అయితే ఇది అధికారికంగా వెల్లడించలేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా లక్ష 4జీ సైట్స్‌ను ఏర్పాటు చేసేందుకు బీఎస్ఎన్ఎల్ ఈ నిధులను వినియోగించాలని భావిస్తోంది. కాగా రూ.19,000 కోట్లతో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే ఇందులో రూ.13,000 కోట్లు ఖర్చు చేసింది.

## రెయిన్‌బో హాస్పిటల్స్ ఆదాయం రూ.398 కోట్లు




**హైదరాబాద్-నవభూమి:** డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్ మెడికేర్ లిమిటెడ్ నికర లాభం 10.2 శాతం వృద్ధితో రూ.68.94 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.62.57 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో రెవెన్యూ రూ.335.96 కోట్ల నుంచి రూ.398.08 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో హాస్పిటల్స్‌లో సేవల విస్తరణ కోసం రూ.21.83 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు రెయిన్‌బో పేర్కొంది. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 100 పడకలతో ఏర్పాటు చేస్తున్న రీజినల్ హబ్ హాస్పిటల్ వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

## ఆసియా ఇండెక్స్ బ్రాడ్ మార్కెట్ ఫ్యామిలీ విస్తరించడంలో భాగంగా 5 కొత్త సూచికలను ప్రకటించింది

**ముంబై- నవభూమి:** ఆసియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పూర్తి BSE యాజమాన్యంలోని అనుబంధ సంస్థ, తన బ్రాడ్ మార్కెట్ ఫ్యామిలీ ఇండెక్స్ విస్తరణలో 5 కొత్త సూచికలను ప్రారంభించినట్లు ప్రకటించింది. BSE 1000-ఈ సూచిక BSE ఆల్‌క్యాప్ లోని 1000 అతిపెద్ద అత్యంత లిక్విడ్ భారతీయ కంపెనీల పనితీరును కొలుస్తుంది. సూచిక గురించి మరింత తెలుసుకోవడానికి ఇక్కడ క్లిక్ చేయండి.


BSE నెక్స్ట్ 500-ఈ సూచిక 500లో భాగం కాని BSE 1000లోని 500 కంపెనీల పనితీరును కొలుస్తుంది. ఈ సూచిక గురించి మరింత తెలుసుకోవడానికి ఇక్కడ క్లిక్ చేయండి. 250 మైక్రోక్యాప్-ఈ సూచిక నెక్స్ట్ 500 లోని 250 అతిపెద్ద మరియు అత్యంత లిక్విడ్ కంపెనీల పనితీరును కొలుస్తుంది. ఈ సూచిక గురించి మరింత తెలుసుకోవడానికి ఇక్కడ క్లిక్ చేయండి. BSE నెక్స్ట్ 250 మైక్రోక్యాప్-ఈ సూచిక BSE 250 మైక్రోక్యాప్‌లో భాగం కాని ఐ నెక్స్ట్ 500లోని 250 కంపెనీల పనితీరును కొలుస్తుంది. BSE 1000 మల్టీక్యాప్ ఈక్వల్ సైజ్ వెయిటెడ్ (25%)- ఇది BSE 100 లార్జ్‌క్యాప్ TMC, BSE 150 మిడ్‌క్యాప్, BSE 250 స్మాల్‌క్యాప్ మరియు ఐనెక్స్ట్ 500 యొక్క షేర్లను కలిగి ఉన్న సమ్మేళన సూచిక. ఈ సూచికలో ప్రతి పరిమాణ విభాగం 25% బరువుతో సమానంగా ఉంటుంది, వాటి పరిమాణ విభాగాలలోని భాగాలు ఉచిత ఫ్లోట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా ఉంటాయి. ఈ సూచిక గురించి మరింత తెలుసుకోవడానికి ఇక్కడ క్లిక్ చేయండి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిస్టర్. అశుతోష్ సింగ్, ఎండీ, సీఈవో, ఆసియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇలా అన్నారు, "దేశంలో మొదటి 1000 స్టాక్ ఇండెక్స్‌ను ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉంది. %దీూజు% 1000 భారతదేశం యొక్క మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో సుమారు 95%ని సూచిస్తుంది. భారతీయ మూలధన మార్కెట్ల లోతు మరియు వెడల్పు పెరుగుతున్నందున, 501-1000 నుండి 500 స్టాక్‌ల పనితీరును సంగ్రహించే BSE 500 వంటి సూచికను కలిగి ఉండటం చాలా ముఖ్యం. మార్కెట్ భాగస్వామ్యం విస్తరించడంతో లిక్విడిటీ మెరుగవుతోంది, అలాగే పెట్టుబడిదారుల ఆధారిత నియంత్రణ మార్పుల ప్రభావంతో విశ్వాసం బలపడుతోంది. ఈ సూచికలు అభివృద్ధి చెందుతున్న కంపెనీల పురోగతిని ట్రాక్ చేయడానికి మార్కెట్ పాల్గొనేవారికి విలువైన అవకాశాన్ని అందిస్తాయి. చారిత్రక డేటా పునర్వ్యవస్థీకరణ ధోరణులు సూచిస్తున్నట్లుగా, భారతదేశంలోని అనేక మిడ్‌క్యాప్‌లు లార్జ్‌క్యాప్‌లు తమ ప్రయాణాన్ని నెక్స్ట్ 500 గ్రూపింగ్‌లో ప్రారంభించాయి, ఇది ఈ విభాగంలో ఉన్న అవకాశాలను మరింత బలోపేతం చేస్తోంది. ఈ కొత్త సూచికను ETFలు ఇండెక్స్ ఫండ్స్ వంటి నిష్క్రియాత్మక వ్యూహాలను అమలు చేయడానికి అలాగే భారతదేశంలోని అన్ని ప్రధాన రంగాలలో కొత్త కంపెనీల పనితీరును అంచనా వేయడానికి ఉప యోగించవచ్చు.

PMS వ్యూహాలు, పథకాలు మరియు ఫండ్ పోర్ట్‌ఫోలియోల బెంచ్‌మార్కింగ్ కోసం కూడా దీనిని ఉపయోగిం చవచ్చు. పెట్టుబడిదారులు ఇప్పుడు విస్తృత శ్రేణి మార్కెట్ అవకాశాలను పొందవచ్చు, BSE సూట్లకు ఈ తాజా చేరికతో వారి పెట్టుబడి వ్యూహాలను మరింత సుసంపన్నం చేయవచ్చు.

### సంజయ్ - జ్యోతి అగర్వాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# మెగా రక్తదాన శిబిరం





**జైపూర్- నవభూమి:** సంజయ్ జ్యోతి అగర్వాల్ ఫౌండేషన్ (ఎస్ జె ఎఫ్) భారతదేశంలో అతిపెద్ద స్మాల్ ఫినాన్స్ బ్యాంక్ అయిన ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయు ఎస్ ఎఫ్ బి)తో కలిసి దేశవ్యాప్తంగా ఉన్న పలు నగరాల్లో భారీ స్థాయిలో రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఢిల్లీ, ముంబై, పుణే, నాగపూర్, ఇండోర్, రాయ్ పూర్, అహ్మదాబాద్, జిరక్‌పూర్, షాపురా, ఉదయ్‌పూర్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, మరియు జైపూర్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు ప్రజలను ప్రోత్సహించడం, సమాజానికి సేవ చేయడం, మరియు దయాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత మూడు సంవత్సరాల విజయాన్ని కొనసాగిస్తూ, ఈ ఏడాది రక్తదాన శిబిరం మరింత విశేష స్పందనను పొందింది. 1,000 మందికి పైగా దాతలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఏయు స్మాల్ ఫినాన్స్ బ్యాంక్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీ శ్యామ్ మహోత్సవ సేవా సమితి, లైఫ్ బ్లడ్ డొనేషన్ కౌన్సిల్, మరియు సేవా మొబ్ ట్రస్ట్ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టారు. రక్తాన్ని సేకరించడం మాత్రమే కాకుండా, స్వచ్ఛంద రక్తదాన ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, మరియు అవయవదానానికి ప్రజలను ప్రేరేపించడమే ప్రధాన లక్ష్యాలు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమాలను సందర్శించడం, అక్కడ ఉన్న పిల్లలతో సంతోషాన్ని పంచుకోవడం వంటి సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ కార్యక్రమం సంజయ్ - జ్యోతి అగర్వాల్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు, ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ - సీఈఓ అయిన శ్రీ సంజయ్ అగర్వాల్ గారి 55వ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించబడింది. ఈ సందర్భంగా, సంజయ్ - జ్యోతి అగర్వాల్ ఫౌండేషన్ (ఎస్ జె ఎఫ్) వ్యవస్థాపక ట్రస్టీ అయిన శ్రీమతి జ్యోతి అగర్వాల్ మాట్లాడుతూ, "ప్రతి ఏడాది నిర్వహించే ఈ రక్తదాన శిబిరంలో నిస్వార్థ సేవా భావంతో దాతలు, వైద్య నిపుణులు, మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొనడం మాకు గర్వకారణం. ఏటా పెరుగుతున్న ఈ స్పందన మానవత్వం గల సమాజాన్ని నిర్మించడానికి చేసే కృషికి నిదర్శనం. ఒక్కొక్కరు ఇచ్చే ఈ రక్తదానం ప్రాణాలను రక్షించే జీవిత రేఖగా నిలుస్తుంది. మనం కలిసికట్టుగా ఉంటే మరింత ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని సృష్టించగలు గుతాం" అని అన్నారు. ఈ ఏడాది కార్యక్రమానికి వచ్చిన భారీ స్పందన మనుషుల మధ్య ఉన్న మానవత్వానికి మరియు ఐక్యతకు నిదర్శనం. రక్తదాన కార్యక్రమానికి ఆగిపోయ కుండా, సంజయ్ జ్యోతి అగర్వాల్ ఫౌండేషన్ విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, కళలు, క్రీడలు మరియు సామాజిక అభివృద్ధికి సహాయపడే ఇతర సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.

## 1138 పాయింట్లు పడిపోయిన స్టాక్ మార్కెట్.. ఇన్వెస్టర్ల ఆందోళన



**న్యూఢిల్లీ-నవభూమి:**స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తుంది. ఈ క్రమంలోనే సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్ మరోసారి భారీ నష్టాలతో ముగిసింది. ఈ క్రమంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 548.39 పాయింట్లు పడిపోయి 77,311.80 వద్ద ముగిసింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 50 కూడా 178.35 పాయింట్లు తగ్గి 23,381.60 వద్ద ముగిసింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 178 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ ఏకంగా 1138 పాయింట్లు దిగజారింది.

**ఈ స్టాక్స్ మాత్రం..**

ఈ క్రమంలో సెన్సెక్స్‌లో నష్టపోయిన షేర్లలో టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. మరోవైపు ఎం అండ్ ఎం, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ షేర్లు కొన్ని ప్రారంభ లాభాలను నమోదు చేశాయి. దీంతో పలువురు మదుపర్లు పెద్ద ఎత్తున నష్టపోగా, మరికొంత మంది మాత్రం లాభపడ్డారు. ఇది అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం వల్ల క్షీణించిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ట్రంప్ నిర్ణయాలు కూడా..**

సోమవారం రోజున ట్రంప్ తన ప్రకటనలో మాట్లాడుతూ వచ్చే సోమవారం లేదా మంగళవారం నాటికి అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై కొత్త సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో అమెరికా అంతర్జాతీయ వ్యాపారాన్ని తనకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు పెంచుతున్నట్లు వెల్లడించారు. దీంతో మార్కెట్లు మరింత దిగజారాయి. గత వారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాతో వాణిజ్య యుద్ధానికి సంబంధించిన కొత్త సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత కూడా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై ప్రభావం పడింది.

**తగ్గిన రూపాయి విలువ**

అంతర్జాతీయ అంశాలు మార్కెట్లపై ప్రభావం చూపిన నేపథ్యంలో రూపాయి విలువ మరింత తగ్గింది. ఈ క్రమంలో రూపాయి విలువ 0.2% తగ్గి రూ. 87.59కి చేరుకుంది. రూపాయి విలువ తగ్గిన నేపథ్యంలో ఆహార ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడులు మరింత తగ్గి కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. స్టాక్ మార్కెట్ క్షీణతకు మరో కారణం ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య పోటీ పెరగడం.

**మార్కెట్ అంతటా..**

ఈ క్రమంలో డాలర్ ఇండెక్స్ 108 స్థాయికి చేరుకుంది. 10 సంవత్సరాల %ఖూ% బాండ్ దిగుబడి 4.4 శాతానికిపైగా చేరింది. ఇదే సమయంలో ఫారెన్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్లు మరింత అమ్మకాలు చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్ అంతటా అస్థిరత పెరిగింది. ఇండియా ఇ (భారత మార్కెట్ అస్తిరత సూచిక) 5% పైగా పెరిగింది. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పాలసీ నిర్ణయాల ప్రస్తుత పరిణామాలను నమ్మినప్పటికీ, మార్కెట్లలో స్థిరమైన ర్యాలీకి దారితీసే అవకాశం చాలా తక్కువగా కనిపిస్తోంది.

## 2047 నాటికి ఫార్మా ఎగుమతులు రూ.30 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ఫార్మా ఎగుమతులు 2047 నాటికి 35,000 కోట్ల డాలర్లకు (రూ.30.10 లక్షల కోట్లు) చేరుతాయని అంచనా. అంటే ప్రస్తుత విలువతో పోల్చితే 10 రెట్లు అధికం. అలాగే ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల్లో ప్రపంచ స్థాయిలో భారత్ 11వ స్థానంలో ఉండగా అప్పటికి టాప్ 5లోకి చేరుతుందని ఫార్మెక్సిల్, భారత ఫార్మా సంస్థలతో కలిసి బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అనుసరిస్తున్న పరిమాణం ఆధారిత వైఖరి నుంచి విలువ ఆధారిత వ్యూహం అనుసరించడం ద్వారానే భారత్ ఈ ఘనత సాధిస్తుందని కూడా పేర్కొంది. భారత్ ప్రస్తుతం జెనరిక్ ఔషధాల సరఫరాలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. 2023లో ఫార్మా ఎగుమతులు 2,700 కోట్ల డాలర్ల (రూ.2.32 లక్షల కోట్లు) స్థాయిలో ఉండగా 2030 నాటికి 6,500 కోట్ల డాలర్లకు (రూ.5.59 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. రాబోయే కాలంలో స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, ఇన్నోవేటివ్ ఫార్మా ఉత్పత్తులపై దృష్టి సారించటం ద్వారా విలువ మరింతగా పెరుగుతుందని ఆ నివేదికలో తెలిపారు.

విధానపరమైన భారత ఫార్మా సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగంలోకి తేవాలంటే విధానపరమైన మద్దతు అవసరమని ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ సమాఖ్య (ఐడీఎంఏ) జాతీయ అధ్యక్షుడు విరంచి షా అన్నారు. ప్రధానంగా ఎగుమతులకు నాన్ టారిఫ్ అవరోధాలను తొలగించి విభిన్న దేశాలకు విభిన్న ఎగుమతి వ్యూహాలు అనుసరించాలని సూచించారు. 40 కొత్త కెమికల్, బయోలాజికల్ ఎంటిటీలు అభివృద్ధి దశలో ఉన్న నేపథ్యంలో ఇన్నోవేషన్ విభాగంలో భారత ఎగుమతులు 2047 నాటికి 1,300-1,500 కోట్ల డాలర్లకు (రూ.11.18 -12.90 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. కాగా స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, వ్యాక్సిన్లు, అడ్వాన్స్‌డ్ థెరపీల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం ద్వారా 2047 నాటికి అంచనా వేస్తున్న ఎగుమతుల స్థాయికి చేరగలుగుతామని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజా భాను అన్నారు.

## మహిళలకు షాక్.. ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకున్న పసిడి ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఏదేశంలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరకు రెక్కలు వచ్చాయి. ఇప్పటికే గరిష్టాల వద్దకు చేరిన బంగారం ధరలు సోమవారం ట్రేడింగ్‌లో మరింత పైకి ఎగబాకాయి. పది గ్రాముల బంగారం ధర 87 వేలను దాటేసి రికార్డు సృష్టించింది. పది గ్రాముల బంగారం ధర 87 వేల రూపాయలను దాటడం ఇదే ప్రథమం. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 పెరిగి రూ.79, 800కు చేరుకుంది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.390 పెరిగి 87, 060కు చేరింది.

నిజానికి ఈ నెల ఒకటో తేదీ నుంచి బంగారం ధరలు పెరుగుతూనే వస్తున్నాయి. పది గ్రాముల బంగారం ధర రూ.80 వేలు దాటిన తర్వాత చాలా తక్కువ కాలంలోనే రూ.87 వేలకు కూడా చేరుకుంది. భవిష్యత్తులో పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలకు కూడా చేరవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఫిబ్రవరి 10న) దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి తెలుసుకుందాం..

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 87, 060, రూ. 79, 800
విజయవాడలో రూ. 87, 060, రూ. 79, 800
ఢిల్లీలో రూ. 87, 210, రూ. 79, 950
ముంబైలో రూ. 87, 060, రూ. 79, 800
వడోదరలో రూ. 87, 110, రూ. 79, 850
కోల్‌కతాలో రూ. 87, 060, రూ. 79, 800
చెన్నైలో రూ. 87, 060, రూ. 79, 800
బెంగళూరులో రూ. 87, 060, రూ. 79, 800
కేరళలో రూ. 87, 060, రూ. 79, 800
పుణెలో రూ. 87, 060, రూ. 79, 800

## రివర్సల్‌కు అవకాశం

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చిత పరిస్థితులు ముగుస్తున్నాయి. పరిస్థితులు కుదుటపడుతుండటంతో మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్ పెరుగుతోంది. పైగా ఫండమెంటల్స్ బాగున్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. ప్రస్తుతం బెంచ్‌మార్క్ సూచీలన్నీ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఆటో, వినియోగ రంగాల షేర్లు పటిష్ఠంగా ట్రేడవుతున్నాయి. మీడియా, రియల్టీ రంగాలు మెరుగవుతున్నాయి.

**స్టాక్ రికమండేషన్స్**

టాటా స్టీల్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉంది. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత మూమెంటమ్ మొదలైంది. చక్కటి రిలేటివ్ స్ట్రెంత్ ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 4.35 శాతం లాభంతో రూ.138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.135 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.130 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

**హిందాల్కో:** గత ఏడాది నవంబరు నాటి గరిష్ఠం నుంచి 30 శాతం మేరకు దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం బలం ప్రదర్శిస్తోంది. కీలకమైన రూ.560 స్థాయిలో రెండు సార్లు మద్దతు లభించింది. మెటల్ రంగం మెరుగ్గా రాణిస్తుండటం, త్వరలో ఆర్థిక ఫలితాలు వెల్లడించే నేపథ్యంలో ఈ షేరుపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది గత శుక్రవారం రూ.607 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ఎంటరై రూ.674/710 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.570 స్థాయిని కచ్చితమైన **స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.**

ఎస్‌పీఐసీ (స్పిక్) లిమిటెడ్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రూ.70 స్థాయిలో సపోర్ట్ తీసుకున్న ఈ షేరు తక్షణ నిరోధ స్థాయి రూ.80ని బ్రేకౌట్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.82 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.80 శ్రేణిలో ప్రవేశించి రూ.96/100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించాలి. అయితే రూ.77 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి. చంబల్ ఫెర్టిలైజర్స్: గత ఏడాది జూన్ నుంచి ఈ షేరు సైడ్‌వేసలో కన్సాలిడేషన్ అవుతూ వస్తోంది. తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో గతవారం ఈ షేరు మెరుగ్గా రాణించింది. కీలకమైన రూ.555 రెసిస్టెన్స్ జోన్‌కు చేరుకుంది. గత శుక్రవారం రూ.555 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.520/540 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.490 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి. కేఫిన్ టెక్నాలజీస్: జీవితకాల గరిష్ఠం తర్వాత 36 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది.





## కుంభమేళా ట్రాఫిక్ అప్‌డేట్స్ ఇలా తెలుసుకోండి.. సులభంగా వెళ్లండి..

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రోజురోజుకు లక్షలాది మంది భక్తులు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని అనేక చోట్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతుంది. ప్రధానంగా జబల్‌పూర్-కట్నీ-సియోని వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రయాగ్‌రాజ్ చేరుకునేందుకు అనేక మంది భక్తులకు ఎక్కువ సమయం పడుతుంది. పలు నివేదికల ప్రకారం 500 కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ జామ్ ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇది చరిత్రలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌లలో ఒకటని చెబుతున్నారు.
ముందుగా తెలుసుకునిఅయితే ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్శన కోసం వెళ్ళే వారు ఈ ట్రాఫిక్ పరిస్థితులను ముందుగా తెలుసుకుని వెళ్లాలని సూచిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ, రహదారి మూసివేత మార్గాల గురించి రియల్ టైమ్ అప్‌డేట్‌లు తెలుసుకోవడం ద్వారా మీరు సులభంగా మీ గమ్యానికి చేరుకోవచ్చు. గూగుల్ మ్యాప్స్ ఈ విషయంలో మీకు కీలక సమాచారాన్ని ప్రత్యేకంగా అందిస్తున్నాయి. అయితే ఎలా చెబుతుందనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.రియల్ టైమ్ అప్‌డేట్..ప్రస్తుతం గూగుల్ మ్యాప్స్ పరికరాల్లో అందుబాటులో ఉంది. ఇది రియల్-టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్‌లను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీని ద్వారా మీరు రోడ్లలో రద్దీని గమనించి, వేగవంతమైన మార్గాన్ని ఎంచుకోవచ్చు. ఈ యాప్ ట్రాఫిక్ పరిస్థితిని రంగు కోడెడ్ సిస్టమ్ ద్వారా మీకు అందిస్తుంది.

## మహామండలేశ్వర్ పదవికి రాజీనామా.. ఇన్‌స్టాలో వెల్లడించిన మమతా కులకర్ణి



**న్యూఢిల్లీ-నవభూమి:** కిన్నర్ అఖాడా మహామండలేశ్వర్ పదవికి తాను రాజీనామా చేసినట్టు బాలీవుడ్ నటి మమతా కులకర్ణి అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు సోమవారంనాడు ఒక వీడియోను సామాజిక మాధ్యమంలో ఆమె షేర్ చేశారు. మమతా కులకర్ణి నియామకంపై ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠి, కిన్నర్ అఖారా వ్యవస్థాపకుడు రిషి అజయ్ దాస్ మధ్య విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఆమె తాజా నిర్ణయం తీసుకున్నారు. తన నిర్ణయాన్ని సామాజిక మాధ్యమంలో వెల్లడించారు.''నేను (మహామండలేశ్వర్ మమత నందగిరి) నా పదవికి రాజీనామా చేశాను. ఈ విషయంలో రెండు గ్రూపులు గొడవ పడటం సరికాదు. 25 ఏళ్లుగా నేను సాధ్విగా ఉన్నాను, ఇకముందు కూడా అలాగే కొనసాగుతాను. మహామండలేశ్వర్‌గా నన్ను నియమించడంపై గొడవ పడటం సరికాదు. 25 ఏళ్ల క్రితమే నేను బాలీవుడ్‌ను విడిచిపెట్టాను. అప్పట్నించీ అందరికీ, అన్నింటికీ దూరంగా ఉంటూ వచ్చాను. నా గురించి ప్రజలు రకరకాలుగా స్పందించడం చూశాను. శంకరాచార్య కావచ్చు, మరొకరు కావచ్చు...నన్ను మహామండేలేశ్వర్‌గా నియమించడం కొందరికి అభ్యంతరకరంగా తోచి ఉండవచ్చు. నేను కైలాస్‌కో, మానస సరోవర్‌కో వెళ్లనక్కర లేదు. 25 ఏళ్ల తపస్సుతో విశ్వం నా కళ్లముందే ఉంది'' అని ఆ వీడియోలో మమతా కులకర్ణి వివరించారు.మహామండలేశ్వర్‌గా మమతా కులకర్ణిని నియమించడంపై అఖారా సాధువులు పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. దీనిపై రిషి అజయ్ దాస్ చర్యలు తీసుకున్నారు. మమతా కులకర్ణి, లక్ష్మీనారాయమఅ త్రిపాఠిలను పదవుల నుంచి తొలగించారు. దీనిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మహామండలేశ్వర్ పదవి నుంచి తనను తొలగించడంపై లక్ష్మీనారాయణ్ త్రిపాఠి అభ్యంతరం వ్యక్తం చేశారు. అఖారా నుంచి 2017లో బహిష్కృతుడైన అజయ్ దాస్ తనను పదవి నుంచి తొలగించడం ఏమిటని ఆయన నిలదీశారు.

## యమునా శాపం తగిలింది.. అతిషితో ఎల్జీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎవరూ కారణాలు వెతుక్కోరు. ఓటమి పాలైనప్పుడు మాత్రం అనేక కారణాలు తెరపైకి వస్తాయి. పదేళ్లకు పైగా అప్రతిహతంగా హస్తినను పాలించిన ఆమ్ ఆద్మీ పార్టీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయింది. 'యమునా'నది శాపం వల్లే 'ఆప్' ఓటమి పాలైనట్టు ఢిల్లీ మాజీ సీఎం అతిషితో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత సీఎం అతిషి తన రాజీనామాను సమర్పించేందుకు ఎల్జీని కలిశారు. ఈ సమయంలో ఎల్జీ అతిషితో మాట్లాడుతూ, యమునా నదిని శుభ్రపరచే ప్రాజెక్టును నిలిపివేయమని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన తర్వాత ఇద్దరం కలిశామని, అప్పుడు యమునా శాపం గురించి ఆయనను హెచ్చరించారని, తన మాటను పెడచెవిన పెట్టారని అతిషితో సక్సేనా చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.యమునా నది శాపం గురించి కేజ్రీవాల్‌ను సక్సేనా హెచ్చరించినట్టు చెబుతున్న విషయం రెండేళ్ల క్రితం నాటిది. యమునా నది పునరుజ్జీవనానికి ఎల్జీ పర్యవేక్షణలో ఉన్నత స్థాయి కమిటీని 2023 జనవరిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. ఇందుకు తొలుత ఆప్ ప్రభుత్వం సహకరించింది. యమునా నది ఆక్రమణల తొలగించడం,11 కిలోమీటర్ల మేర శుభ్రం చేయడ జరిగింది. అయితే ఆ తర్వాత క్రమంలో ట్రిబ్యునల్ ఆదేశాలను సుప్రీంకోర్టులో ఆప్ ప్రభుత్వం సవాలు చేసింది. దీంతో ట్రిబ్యునల్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ప్రస్తుతం రెండేళ్లుగా ఆ స్టే కొనసాగుతోంది. ఎల్జీ పర్యవేక్షణలో పనులు జరిగితే తమ ప్రభుత్వానికి క్రెడిట్ రాదనే అభిప్రాయంతోనే ఆప్ సర్కార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందనే అపప్రదను మూటకట్టుకుంది. సుప్రీంకోర్టు రూలింగ్ తర్వాత ఒక సందర్భంలో కేజ్రీవాల్ కలిసినప్పుడు యమునా నది శాపం పెడుతుందని ఆయనను ఎల్జీ హెచ్చిరించినట్టు తెలుస్తోంది.అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి దశలో యమునా నదీ జలాల అంశం కూడా తెరపైకి వచ్చింది. 'యమున'లో విషం కలుస్తోందంటూ హర్యానా ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ తప్పుపట్టడం, ఇది పెద్ద వివాదానికి దారితీయడం, ఆయన వ్యాఖ్యలపై హర్యానా ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం జరిగింది. యమునా జలాల శుద్ధీకరణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయామని కేజ్రీవాల్ చివరకు ఒప్పుకుంటూనే, మరోసారి అధికారమిస్తే మాట నిలుపుకొంటామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ...అప్పటికే యమునా జలాల విషయంలో జరిగిన డ్యామేజీ 'ఆప్'ను ఎన్నికల ఫలితాల్లో గట్టిగా దెబ్బతీసిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## సీఎం వార్నింగ్‌తో యూట్యూబర్ క్షమాపణ

**న్యూఢిల్లీ-నవభూమి:** హాస్యం పేరుతో 'అసభ్యకర' వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ ఇలాహాబాదియా క్షమాపణలు చెప్పారు. సమయ్ రైనా షో ''ఇండియాస్ గాట్ లాటెంట్''లో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలు మహిళలను అగౌరవపరచేలా, పిల్లల ఆలోచనలను కలుషితం చేసేలా ఉన్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వెంటనే స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సైతం ''హద్దులు దాటితే చర్యలు ఉంటాయి'' అని హెచ్చరించారు. దీంతో 'ఎక్స్' వేదికగా ఇలాహాబాదియా క్షమాపణలు చెప్పారు.

## శీష్ మహల్‌కు దూరంగానే ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి.. కారణం ఏంటంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీలో ఐదు రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం అందరికీ తెలిసిందే. 70 అసెంబ్లీ స్థానాలకు గాను 48 స్థానాలను దక్కించుకుని.. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుంది. అయితే ఇప్పటికీ సీఎం అభ్యర్థి ఎవరనేది బీజేపీ ప్రకటించకపోయినా.. కొత్త ముఖ్యమంత్రి మాత్రం శీష్ మహల్‌లో ఉండరని తెలుస్తోంది. మరి కాషాయ దళం ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంది, దాని వెనుక ఉన్న అసలు కథ ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.ఫిబ్రవరి 5వ తేదీన జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను 8వ తేదీన వెల్లడించారు. అయితే బీజేపీ ఈసారి ఎవరూ ఊహించని విధంగా 48 స్థానాలను దక్కించుకోగా.. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 సీట్లకే సొంతం అయింది. అలాగే ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, అగ్రనాయకులు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లు కూడా ఓడిపోయారు. అగ్ర నాయకుల్లో కేవలం అతిశీ ఒక్కరే విజయం సాధించారు. ఇలా ఆప్ తీవ్ర పరాజయం పాలు కాగా.. బీజేపీ మాత్రం పెద్ద ఎత్తున సంబురాలు చేసుకుంటోంది. అయితే కొత్త ముఖ్యమంత్రి ఎవరనేది మాత్రం ఇంకా ప్రకటించలేదు.ఢిల్లీకి కొత్త ముఖ్యమంత్రిగా ఎవరు అయినప్పటికీ.. శీష్ మహల్‌లో మాత్రం నివాసం ఉండరని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. బీజేపీకి చెందిన సీఎం ఈ బంగ్లాకు చాలా దూరంగా ఉండాలని.. కాషాయ దళం ముందుగానే నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో.. సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లాను ఆయన అధికారిక నివాసంగా ఏర్పరుచుకున్నారు. అయితే బీజేపీ ఈ నివాసాన్ని శీష్ మహల్ (అద్దాల మేడ)గా అభివర్ణిస్తోంది.అందుకు ప్రధాన కారణం.. ఆ భవనాన్ని దాదాపు రూ.80 కోట్ల రూపాయల ప్రజాధనంలో మరమ్మత్తులు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఈ శీష్ మహల్‌ను ఆయుధంగా వాడుకుంటూ.. అరవింద్ కేజ్రీవాల్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సైతం.. దీనిపై విమర్శలు గుప్పించారు. నాలుగు కోట్ల మంది ప్రజలకు తాము ఇళ్లు కట్టించామని చెబుతూనే.. నేనేమీ అద్దాల మేడ కట్టుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ నివాసానికి సంబంధించి వీడియోలు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి.పలువురు బీజేపీ నేతలు అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తూ.. తమదైన స్టైల్లో విమర్శలు చేశారు. వీటన్నిటినీ చూసిన ఢిల్లీ ప్రజల మదిలోకి ఆ అంశం బాగానే వెళ్లింది. ఇలా ఆప్ ఓటమికి ఓ కారణంగా పనికొచ్చిన ఈ శీష్ మహల్‌లో బీజేపీ ముఖ్యమంత్రి ఉన్న వ్యతిరేకత వస్తుందని భావించిన కాషాయ దళం.. దీన్ని దూరంగా పెట్టాలని భావిస్తోందట. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

## పంజాబ్‌లో నాయకత్వ మార్పు తప్పదా?
## అక్కడ ఉప-ఎన్నికల్లో కేజ్రీవాల్ పోటీచేస్తారా?




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధానిలో పదేళ్లకుపైగా అధికారంలో కొనసాగిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని తాజా ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు తిరస్కరించారు. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి ఢిల్లీలో ఓటమిని ఎదుర్కొంది. అంతేకాదు, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఢిల్లీలో అధికారం కోల్పోవడంతో ప్రస్తుతం ఒక్క పంజాబ్‌లోనే ఆప్ అధికారంలో ఉంది. అయితే, పంజాబ్ ఆప్‌లోనూ అసమ్మతి సెగలు కక్కుతున్నట్టు తెలుస్తోంది. దేశ రాజధానిలో దారుణ పరాజయంతో అసమ్మతివాదులు గుర్రుగా ఉన్నారని, పలువురి కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ నేత సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీతో 30 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఏడాది నుంచి సంప్రదింపులు జరుపుతున్నారని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా అన్నారు.'ఆప్‌లో నాయకత్వం పోరాటం ఆసన్నమైంది.. ముఖ్యంగా ఆప్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు.. అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సీఎం భగవంత్ మాన్‌ను తప్పించాలని కోరుతున్నారు.. త్వరలోనే లూథియానా (వెస్ట్) అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరగనుంది.. కాబట్టి కేజ్రీవాల్ ఈ సీటులో పోటీపై దృష్టి సారించవచ్చు' అని అన్నారు. ఇదిలా ఉండగా.. 2027లో పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా.. అప్పటిలోగా ఆప్ చీలిపోవాలని బీజేపీ, కాంగ్రెస్‌లు కోరుకుంటున్నాయని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు కుల్‌దీప్ సింగ్ అన్నారు.''2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా భావిస్తున్నందున కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఆప్‌ను చీల్చాలని కోరుకుంటాయి... ఒకవేళ, లూథియానా (వెస్ట్) నుంచి కేజ్రీవాల్ పోటీ చేయాలని నిర్ణయించుకుంటే.. అది ఆ పార్టీకి నష్టం కలిగించవచ్చు.. అదే జరిగితే ఆప్ జాతీయ రాజకీయాల్లో ఆశలకు ముగింపే అవుతుంది'' అని వ్యాఖ్యానించారు.మరోవైపు, ఈ ఆరోపణలు పంజాబ్ ఆప్ అధికార ప్రతినిధి నీల్ గార్గ్ తోసిపుచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ తమ పార్టీ జాతీయ కన్వీనర్ అని, భగవంత్ మాన్ సింగ్ పంజాబ్ ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ గ్రాఫ్ వేగంగా పడిపోతుందని, ఢిల్లీలో ఆ పార్టీ మూడోసారి సున్నాకే పరిమితమైందని విమర్శించారు. ఇక, 2022 పంజాబ్ ఎన్నికల్లో కేవలం 18 సీట్లను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ.. 2027 ఎన్నికల్లో అంతకంటే తక్కువ సీట్లకే పరిమితమవుతుందని నీల్ గార్గ్ జోస్యం చెప్పారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పనితీరు ఏ పాటిదో చూసే ఉంటారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవకపోవడంపై ప్రతాప్ సింగ్ బజ్వా ఆందోళన చెందాలని సెటైర్ వేశారు.

## కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుణ్యస్నానం



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడకగా పేరొందిన మహా కుంభ మేళాకు తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లోని గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమం వద్ద పుణ్య స్నానం ఆచరించారు. ఆపై యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అక్కడే ఉన్న పక్షులకు ఆహారం కూడా అందించి మరింత మురిసి పోయారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు భద్రతలను కట్టుదిట్టం చేశారు. సోమవారం రోజు ఉదయమే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈక్రమంలోనే ఢిల్లీ నుంచి బయలు దేరిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఉదయం 10 గంటలకు ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. ఈక్రమంలోనే సీఎం యోగిజీ, గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌లు.. ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం పలికారు.పు ష్పగుచ్ఛాలు అందించి మరీ మహాకుంభమేళాకు తీసుకు వచ్చారు. ఆపై ముగ్గురూ కలిసి త్రివేణీ సంగమంలో బోటులో ప్రయాణించారు. ఈ సందర్భంగానే ద్రౌపది ముర్ము సంగమం వద్ద ఉన్న వలస పక్షులకు ఆహారం అందించారు. ఆ తర్వాత గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం వద్ద పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## కాంగ్రెస్ నాయకుల్లో హిందుత్వ భావజాలం..
## కుంభమేళాపై అధ్యక్షుడు అలా.. నేతలు ఇలా!



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** కుంభమేళాపై కాంగ్రెస్ వింత వైఖరి ప్రదర్శిస్తోంది. హస్తం పార్టీకి చెందిన కొందరు నాయకులు లౌకిక వాదాన్ని మాత్రమే పాటిస్తూ.. హిందుత్వ భావజాలాన్ని తప్పుపడుతున్నారు. ముఖ్యంగా కుంభమేళాలో పుణ్యస్నానాలపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. కానీ మరికొందరుకాంగ్రెస్ నాయకులు మాత్రం వీరికి భిన్నంగా ప్రవర్తిస్తూ.. కుంభమేళాకు వెళ్లి పుణ్య స్నానాలు చేస్తున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తన కుటుంబంతో కలిసి అక్కడకు వెళ్లారు. పుణ్య స్నానం చేసి ఆ తర్వాత ప్రత్యేక పూజలు కూడా చేశారు. వీరిలా చేయడం చూస్తుంటే.. కాంగ్రెస్ నాయకుల్లోనూ హిందుత్వ భావజాలం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే జాతీయ అధ్యక్షుడు కుంభమేళాపై విమర్శలు చేస్తుండగా, నేతలు మాత్రం అక్కడకు వెళ్లి పుణ్య స్నానాలు ఎందుకు చేస్తున్నారనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నారు. వాటికి గల కారణాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కుంభమేళాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. గంగలో మునిగినంత మాత్రానా పేదరికం తొలగిపోతుందా, తినేందుకు భోజనం దొరుకుతుందా కామెంట్లు చేయగా.. బీజేపీ పెద్ద ఎత్తున ఫైర్ అయింది. మరోవైపు కాంగ్రెస్ నాయకులు ఆయన్ను సమర్థిస్తూ వచ్చారు. అంతేకాకుండా కాంగ్రెస్ నాయకులు ఎవరూ కుంభమేళాకు వెళ్లట్లేదు. కానీ తాజాగా కొందరు హస్తం పార్టీ నేతలు అక్కడికి వెళ్లి అందరికీ షాక్ ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవలే కుంభమేళాకు వెళ్లి పుణ్య స్నానం ఆచరించారు. అయితే తాజాగా కర్ణాటక డిప్యూటీ సీఎం, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి కుంభమేళాకు వెళ్లారు. ముఖ్యంగా భార్య ఉష, కూతురు ఐశ్వర్యలతో పుణ్య స్నానాలు చేసి ఆపై ప్రత్యేక పూజల్లో కూడా పాల్గొన్నారు.ఇలా ఇద్దరు హస్తం పార్టీ నేతలు కుంభమేళాకు వెళ్లడంతో.. ప్రజలంతా షాక్ అవుతున్నారు. ముఖ్యంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హిందుత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా స్వరం వినిపిస్తూ లౌకికి వాదాన్ని ఫాలో అవుతారు. కానీ తాజాగా డిప్యూటీ సీఎం హిందుత్వ భావాలను చూపించడం ఒక్కొక్కరూ ఒక్కోలా స్పందిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల్లోనూ హిందుత్వ భావజాలం మొదలైందంటూ చెప్పుకొస్తున్నారు. ఒకరు లౌకికవాదులను కలుపుకొస్తే, మరొకరు హిందుత్వ వాదులను సైతం ఆకర్షించి.. పెద్ద ఎత్తున ఓటు బ్యాంకు పొందేందుకే వీరిద్దరూ ఇలా ప్లాన్ చేశారంటూ వివరిస్తున్నారు. మరోవైపు రాహుల్ గాంధీ సైతం వరుసగా పుణ్యక్షేత్రాలకు వెళ్లడాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శిస్తోంది. అక్షరధామ్, ఖోడల్ధామ్ జాసి జీవన్, ద్వారకాధీష్, వీర్ మేఘమాయ, బహుచ రాజీ మరియు సోమనాథ్ లోని ముఖ్యమైన ఆలయాలను సందర్శించారు. దీనిపై బీజేపీ నాయకులు స్పందిస్తూ.. ఫ్యాన్సీ డ్రెస్ హిందుత్వ వాది అంటూ రాహుల్ గాంధీపై కామెంట్లు చేశారు. ఈ విషయాలన్నింటినీ చూస్తుంటే.. హిం ఓదువుల ఓట్లు పొందేందుకే కాంగ్రెస్ నాయకులు తమలో హిందుత్వ భావాలు ఉన్నట్లు చూపించుకుంటున్నారని రాజకీయ నిపు ణులు అంచనా వేస్తున్నారు.కాంగ్రెస్ సైద్ధాంతిక వైఖరిని నిశితంగా పరిశీలిస్తామని.. ఆ పార్టీ మృదువైన హిందుత్వ వైపు మొగ్గు చూపుతుందా లేక లౌకికి వైఖరిని కొనసాగిస్తుందానే అనేది రాబోయే రోజుల్లోనే తెలుస్తుందని రాజకీయ విశ్లేషకుడు బీఎస్ మూర్తి అన్నారు. అలాగే ఎన్నికల ఫలితాలపై ఈ హిందుత్వ భావజాలం పెద్ద ప్రభావమే చూపించే అవకాశం ఉందని వెల్లడించారు. చూడాలి మరి ముందు ముందు ఏం జరగనుంది అనేది.

## రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలకు షాక్.. అనర్హులను గుర్తించి తొలగింపు




**ముంబై-నవభూమి:**మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి, మాఝీ లడ్కీ బహీన్ యోజనను అప్పటి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున అకౌంట్లలో జమ చేయనున్నారు. అయితే ఎన్నికల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చిన సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం.. ఆ పథకాన్ని కొనసాగిస్తూ వస్తోంది. మహారాష్ట్రలో మొత్తంగా ఈ పథకం కింద 2.43 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ముఖ్యమంత్రి, మాఝీ లడ్కీ బహీన్ యోజన కింద ప్రతీ నెల రూ.3700 కోట్లను సర్కార్ ఖర్చు చేస్తోంది. అయితే తాజాగా 5 లక్షల మంది మహిళలు అర్హత లేకున్నా.. ఈ పథకం కింద ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నారని గుర్తించి.. వారిని తొలగించింది.ఈ పథకం కింద లబ్ధిదారుల అర్హతలను పునఃసమీక్షించిన మహారాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల మంది మహిళలను అందులో నుంచి తొలగించినట్లు ఆ రాష్ట్ర మహిళ, శిశు సంక్షమ శాఖ మంత్రి అదితి తట్కారే ట్విటర్ వేదికగా వెల్లడించారు. ఈ పథకానికి అనర్హులుగా ఉన్న మహిళలను తొలగించినట్లు చెప్పారు. తొలగించిన 5 లక్షల మంది మహిళల్లో 2.3 లక్షల మంది మహిళలు ఇప్పటికే సంజయ్ గాంధీ నిరాధార్ యోజన కింద లబ్ధి పొందుతున్నట్లు వెల్లడించారు. మరోవైపు.. 65 ఏళ్లు పైబడిన వారు 1.1 లక్షల మంది మహిళలు ఉన్నారని తేల్చారు. ఇక ఇంకో 1.6 లక్షల మంది మహిళలకు కార్లు ఉన్నాయని.. నమో శక్తి యోజన కింద లబ్ధి పొందుతున్నవారు, కొందరు స్వచ్ఛందంగా ఈ పథకం నుంచి బయటికి వెళ్లాలి అనుకునేవారు ఉన్నారని పేర్కొన్నారు.
ఇటీవల జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమ్మిట్‌లో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. ఈ మహారాష్ట్ర లడ్కీ బహీన్ యోజన కింద దాదాపు 20 లక్షల మంది అనర్హులైన మహిళలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నారని అంచనా ఉన్నట్లు చెప్పారు. ఇలాంటి అనర్హులను పథకం నుంచి తొలగిస్తే మహారాష్ట్ర ఖజానాకు నెలకు రూ.300 కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. 20 లక్షల మంది అనర్హులను తొలగిస్తే.. ఏటా రూ.3600 కోట్లు ఆదా చేయవచ్చని పేర్కొన్నారు.ఇక మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ లడ్కీ బహీన్ యోజన పథకం కింద అప్పటివరకు అందించిన రూ.1500 కాస్తా.. పెంచి రూ.2100 అందిస్తామని.. మహాయుతి కూటమి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెలలో జరిగే మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో దీనిపై దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ఆమోదం కల్పిస్తుందా లేక ఈ పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలను సవరించడాన్ని కొనసాగిస్తుందా అనేది వెల్లడించే అవకాశం ఉంది. అయితే రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ ఈ పథకం కింద ఆర్థిక సహాయం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అదితి తట్కారే స్పష్టం చేశారు.
కౌంటర్ రైలు టిక్కెట్ల కంటే ఆన్‌లైన్ టిక్కెట్స్ ఎందుకు ఎక్కువ రేటు.. మంత్రి క్లారిటీ

## కౌంటర్ రైలు టిక్కెట్ల కంటే ఆన్‌లైన్ టిక్కెట్స్ ఎందుకు ఎక్కువ రేటు.. మంత్రి క్లారిటీ

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో రైల్వే టికెట్ బుకింగ్ ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. గతంలో ప్రయాణికులు టికెట్లను కౌంటర్ వద్ద పోటీపడి నిలబడి, కొనుగోలు చేసేవారు. కానీ ప్రస్తుతం మాత్రం డిజిటల్ వ్యవస్థ పెరగడంతో ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిగా మారిపోయింది. అయితే ఈ కొత్త ఆన్‌లైన్ సౌకర్యం ద్వారా కౌంటర్ టిక్కెట్లతో పోల్చితే కొంచెం ఖరీదైనవిగా మారాయని, అనేక మంది ప్రయాణికులు అనుకుంటున్నారు.కౌంటర్ ద్వారా టికెట్ తీసుకున్న ప్రయాణికులు, ఆన్‌లైన్ టిక్కెట్ల ఎక్కువ ధరలను చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల సంజయ్ రౌత్ (శివసేన) రాజ్యసభలో ప్రస్తావించారు. ఆయన ఆన్‌లైన్ టిక్కెట్లు, కౌంటర్ టిక్కెట్ల కంటే ఎక్కువ ధరలు ఎందుకు ఉంటున్నాయని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు.ఆన్‌లైన్ టిక్కెట్లు (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) ద్వారా మాత్రమే బుక్ చేయవచ్చు. ఇది ఒక అధికారిక వెబ్‌సైట్, యాప్. ఇది టికెట్ బుకింగ్ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కానీ ఈ సౌకర్యాన్ని అందించడానికి చాలా ఖర్చులు చేస్తుంది. సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్, వెబ్‌సైట్ నిర్వహణ, సర్వర్ విస్తరణ, సెక్యూరిటీ మెజర్లు ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఈ ఖర్చులన్నింటిని భర్తీ చేయడానికి సౌకర్య రుసుం వసూలు చేస్తుంది.దీంతోపాటు రైల్వే శాఖ ప్రయాణికుల నుంచి వస్తువులు సేవల పన్ను కూడా వసూలు చేస్తుంది. ఇది భారత ప్రభుత్వానికి చేరుతుంది. దీంతో ఆన్‌లైన్ టిక్కెట్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయని రైల్వే శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండు అదనపు ఛార్జీలు కలిపి ఆన్‌లైన్ టిక్కెట్ల ధరను కౌంటర్ టిక్కెట్ల కంటే ఎక్కువ చేస్తాయన్నారు. అయితే ఈ ఖర్చులు ప్రయాణికులకు ప్రయోజనాలు కూడా అందిస్తున్నాయన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


## ఆ క్రెడిట్ ఆయనకు దక్కాల్సిందే.. కానీ..



కాలికి చిన్న గాయమై రష్మిక కాస్త రెస్ట్‌లో ఉన్నారు. దాంతో శనివారం జరిగిన 'పుష్ప 2 ది రూల్' థ్యాంక్స్ మీట్‌కు హాజరుకాలేకపోయింది. దీంతో చిత్రబృందాన్ని ఉద్దేశించి నేషనల్ క్రష్ రష్మిక ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది."శనివారం జరిగిన పుష్ప 2 థాంక్యూ మీట్‌లో నేను పాల్గొనలేకపోయా. కాకపోతే నేడు కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నా. సుకుమార్ సర్, అల్లు అర్జున్, మైత్రి మూవీ మేకర్స్ సంస్థకు థాంక్యూ. మీరెంతో శ్రమించి మాకు ఇలాంటి మాస్టర్‌పీస్‌ను అందించినందుకు ఒక ప్రేక్షకురాలిగా ధన్యవాదాలు. అలాగే, శ్రీవల్లిగా చెప్పాలంటే మీకు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమాని తెరకెక్కించడంలో అన్ని విభాగాలు అద్భుతంగా వర్క్ చేశాయి. ఈ ప్రయాణంలో నన్ను భాగం చేసినందుకు, నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రత్యేకమైన రోల్ ఇచ్చినందుకు థాంక్యూ" అని ఆమె పేర్కొన్నారు.అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో తెరకెక్కిన 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా 'పుష్ప: 2 ది రూల్' వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. రష్మిక కథానాయిక. ఈ సినిమా గత డిసెంబరులో విడుదలై భారీ హిట్ అయింది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం శనివారం రాత్రి హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. "ఈ సినిమా పోస్టర్‌పై నా బొమ్మ చూసుకున్న ప్రతిసారీ ఎంత అదృష్టమో అనిపిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ వల్లే ఈ చిత్రం సాధ్యమైంది.



# హీరోయిన్‌కి ప్రియుడు కావలెనట..!





పదేళ్ల క్రితం రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. బాలీవుడ్‌కి చెందిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో మొదట్లో వరుసగా సినిమాల్లో నటించింది. కపూర్ బ్యూటీ అనే ట్యాగ్‌తో టాలీవుడ్‌లో మంచి ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోవడంతో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రెగ్యులర్‌గా వార్తల్లో నిలిచే సీరత్ కపూర్ అడపా దడపా సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. తాజాగా ఈ అమ్మడు హైదరాబాద్‌లో సందడి చేసింది. కరోనా సమయంలో నేరుగా ఓటీటీలో వచ్చిన 'కృష్ణ అండ్ హీజ్ లీల' సినిమాను థియేట్రికల్ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. త్వరలో 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో థియేటర్‌ల ద్వారా రాబోతున్న సినిమా ప్రమోషన్ కోసం సీరత్ కపూర్ మీడియా ముందుకు వచ్చింది. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా సీరత్ కపూర్ ఆ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. సినిమాను థియేటర్‌లో చూడటం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది. అదే సమయంలో మీడియా వారు.. ఈ వాలెంటైన్స్ డే ప్లాన్ ఏంటి అని ప్రశ్నించిన సమయంలో సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. వాలంటైన్స్ డే ప్లాన్స్ ఏం లేవని, ప్రస్తుతం తాను సింగిల్‌గా ఉన్నాను. మింగిల్ కావడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చింది. వాలంటైన్స్ డే రోజు ఎవరైనా రోజా ఫ్లవర్ ఇస్తే తీసుకోవడానికి రెడీ అన్నట్లు చెప్పుకొచ్చింది. సింగిల్‌గా ఉన్న సీరత్ కపూర్ వచ్చే వాలంటైన్స్ డే వరకు అయినా మింగిల్ కావాలని కోరుకుంటున్నాం అంటూ సోషల్ మీడియా ద్వారా చాలా మంది ఆమె అభిమానులతో పాటు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ లో ఎక్కువ శాతం మంది సింగిల్‌గా ఉండరు. రహస్య ప్రేమాయణం సాగిస్తూ ఉంటారు. కానీ సీరత్ కపూర్ మాత్రం సింగిల్ అని క్లీయర్‌గా చెప్పేసింది. సినిమా ఇండస్ట్రీలో మొదట అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. నటిగా, మోడల్‌గా, డాన్సర్‌గా ఎన్నో రకాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న సీరత్ కపూర్ బాంద్రాలోని నేషనల్ కాలేజీలో ప్రీ యూనివర్శిటీ కోర్సును పూర్తి చేసింది. మాస్ కమ్యూనికేషన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని అనుకుంది. కానీ నటనలో బిజీ కావడంతో డిగ్రీని మధ్యలోనే వదిలేసింది. ఎప్పటికైనా తన డిగ్రీని పూర్తి చేయాలని కోరుకుంటున్నాను అంటూ గతంలో ఒక ఇంటర్వ్యూలో సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది. 16 ఏళ్ల వయసులో బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఆష్లే లోబో, ది డాన్స్ వర్క్స్ వద్ద డాన్సర్‌గా జాయిన్ అయ్యింది. కపూర్ డాన్స్ అకాడమీలోనూ ట్రైనర్‌గా సీరత్ కపూర్ కొన్నాళ్లు చేసింది. రాక్ స్టార్ సినిమాకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేయడంతో సీతర్ కపూర్ దశ తిరిగింది.

## హీరోయిన్ లిప్స్ సర్జరీ.. నిజం ఎంత?

సరదా

ఇప్పుడు ఈ సర్జరీల విషయం ఏందుకు వచ్చిందంటే స్టార్ హీరోయిన్ త్రిష లిప్స్ సర్జరీకి సిద్ధం అయ్యిందనే వార్త తమిళ్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. బాలీవుడ్, టాలీవుడ్ హీరోయిన్స్‌లో ఎంతో మంది అందం కోసం చిన్న చిన్న సర్జరీ చేయించుకున్నారు. హీరోయిన్స్ మాత్రమే కాకుండా హీరోల్లోనూ కొందరు సర్జరీలు చేయించుకున్న వారు ఉన్నారు. కొందరు పెద్ద పెద్ద సర్జరీలు సైతం చేయించుకున్న వారు ఉన్నారు. కొందరు సర్జరీలు వికటించడంతో సినిమాలకు దూరం అయిన వారు ఉన్నారు. ఇప్పుడు ఈ సర్జరీల విషయం ఏందుకు వచ్చిందంటే స్టార్ హీరోయిన్ త్రిష లిప్స్ సర్జరీకి సిద్ధం అయ్యిందనే వార్త తమిళ్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. కెరీర్ ఆరంభం నుంచి త్రిష లిప్స్ విషయంలో కొందరు ట్రోల్స్ చేస్తూ వస్తున్నారు. చాలా సార్లు ఆమె లిప్స్ గురించి దారుణమైన బూతులు తిట్టిన వారు ఉన్నారు. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన దాదాపు 20 ఏళ్ల తర్వాత త్రిష ఇప్పుడు లిప్స్ సర్జరీకి వెళ్లడంపై ఆలోచన చేస్తుందట. ఇప్పటికీ చాలా బిజీగా సినిమాలు చేస్తున్న త్రిష ఉన్నట్టుండి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కారణం ఏమై ఉంటుందా అంటూ ఆమె ఫ్యాన్స్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు. ఇన్నాళ్లు అయినా లిప్స్ గురించి విమర్శలు ఆగడం లేదు, అందుకే త్రిష ఈ నిర్ణయాన్ని తీసుకుందని, కేవలం 20 నుంచి 30 రోజుల్లో సర్జరీ జరగడంతో పాటు, నార్మల్‌గా షూటింగ్‌కు హాజరు అయ్యే విధంగా త్రిష చిన్న సర్జరీకి సిద్ధం అవుతోందని తమిళ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆమె నుంచి కానీ, ఆమె సన్నిహితుల నుంచి కానీ ఈ విషయమై ఎలాంటి క్లారిటీ రాలేదు. కానీ త్రిష ఇప్పుడు ఉన్నట్టు ఉంటేనే బాగుంటుందని, ఆమె అందం పెంచుకోవడం కోసం లిప్స్ షేప్ కోసం సర్జరీకి వెళ్తే అభిమానులకు ఆమె నిరాశ కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో త్రిష సర్జరీ చేయించుకోవడం ద్వారా లేని పోని అనారోగ్య సమస్యలు సైతం వస్తాయేమో అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. త్రిష సర్జరీ గురించి వస్తున్న వార్తలు పుకార్లే కావాలని, నిజం కాకూడదని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. మేనల్లుడితో ధనుష్ లవ్ గేమ్ త్రిష ప్రస్తుతం టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా విశ్వంభర సినిమాలో నటిస్తోంది. ఈ సమ్మర్‌లోనే చిరంజీవితో కలిసి త్రిష విశ్వంభర సినిమాతో రానుంది. మరో వైపు తమిళ్‌లోనూ సూపర్ స్టార్ సినిమాలో నటిస్తోంది. త్వరలోనే అక్కడ కూడా ఈ అమ్మడి సినిమా విడుదల కాబోతుంది. దాదాపు మూడు నాలుగు సినిమాలతో ఈ ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న త్రిష వచ్చే ఏడాదిలో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. లిప్ సర్జరీ తర్వాత త్రిష ఎలా ఉంటుందా అని కొందరు ఇప్పటి నుంచే సోషల్ మీడియా ద్వారా ఊహా చిత్రాలు పంచుకుంటున్నారు. కానీ ఇప్పటివరకు త్రిష టీం నుంచి ఈ విషయమై క్లారిటీ రాలేదు.










## 'తండేల్' కోసం ఫిబ్రవరి 14 న రిపీటెడ్ లవర్స్!



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన తండేల్‌భారీ విజయం దిశగా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే సినిమా 50 కోట్లకు పైగా వసూళ్లను సాధించించి వంద కోట్ల వసూళ్లు దిశగా అడుగులు వేస్తోంది. సినిమా భారీ విజయం సాధించడంతో టీమ్ అంతా ఎంతో సంతోషంగా కనిపిస్తుంది. చాలా కాలం తర్వాత చైతన్యకి మరో బ్లాక్ బస్టర్ పడటంతో అక్కినేని కుటుంబం సహా, అభిమానులంతా ఎంతో ఎగ్జైట్ మెంట్ కి గురవుతున్నారు.ముఖ్యంగా ఈసినిమా చందు మొండేటి అన్నట్లు ప్రేమికులకు బాగా కనెక్ట్ అవుతుంది. రిలీజ్‌కి ముందే రిపీటెడ్ లవర్స్ ఈ సినిమాకి ఉంటారని చెప్పారు. ఆయన చెప్పినట్లే ప్రేమికుల హృదయాల్ని సినిమా హత్తుకుంటుంది. ప్రేమికుల ఎడబాటును..భావోద్వేగాలను చందు ఆవిష్కరించిన తీరుకు ప్రేమికులంతా ఫిదా అవుతున్నారు. ఓ భగ్న ప్రేమికుడు అయితే థియేటర్లో తన ప్రేయసిని గుర్తు చేసుకుని ఎంతో ఎమోషనల్ కు గురయ్యాడు. ఇప్పటికే ఆ వీడియో నెట్టింట కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే.ఇక ఈ సినిమాకు ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం మరింత కలిసొచ్చే రోజుగా చెప్పాలి. ప్రేమికుల దినోత్సవం వస్తోన్న రోజుల్లోనే సినిమా రిలీజ్ అవ్వడం కూడా కలిసొస్తుంది. ఫిబ్రవరి 14కి ఇంకా నాలుగు రోజులు సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఆ స్పెషల్ డేని జంటలు తండేల్ థియేటర్లో ఆస్వాదించాలని ప్లాన్ చేసుకుంటున్నారట. లవర్స్ డే రోజున పబ్లిక్ పార్కుల్లో...ప్రదేశాల్లో ప్రేమికులు కనిపించడానికి వీలు లేదు.అలా కనిపిస్తే వివిధ సంఘాలు పెళ్లిళ్లు చేసేస్తుంటారు. ప్రముఖంగా మేజర్ సిటీస్‌లో ఈ సమస్య తలెత్తుతుంది. అదే థియేటర్లో అయితే ఎలాంటి సమస్య ఉండదు. ప్రేమికుల రోజున లవ్ స్టోరీ చూస్తే అదో మెమోరీగానూ మిగిలి పోతుంది. ఈ నేపథ్యంలో వెలెంటైన్స్ డే రోజున చాలా మంది ప్రేమికులు తండేల్ థియేటర్లో ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పటికే చాలా మంది ప్రేమికులు తండేల్ వీక్షించారు. కానీ ఫిబ్రవరి 14న రి రిపీటెడ్ లవర్స్ ఎక్కువగా ఉంటారని మేకర్స్ కూడా భావిస్తున్నారు.

## రైజ్..రూల్ తర్వాత 'పుష్ప-3' ర్యాంపేజ్!



'పుష్ప' ఫ్రాంచైజీతో అల్లు అర్జున్ -సుకుమార్ పాన్ ఇండియాలో ఓ బ్రాండ్ గా మారిన సంగతి తెలిసిందే. 'పుష్ప' ది రైజ్... 'పుష్ప ది రూల్' అటూ ఇద్దరు బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనాలు అన్నీ ఇన్నికావు. రెండు భాగాలు కలిపి బాక్సాఫీస్ వద్ద 2200 కోట్లకు పైగా వసూళ్లను సాధించాయి. రెండవ భాగంతో ఏకంగా 'బాహుబలి' రికార్డులే చెరిగిపోయాయి. దీంతో 'పుష్ప3' కూడా ఉంటుందని ప్రకటించారు. రెండు భాగాల నుంచి కొన్ని లీడ్స్ కూడా ఇచ్చారు. అయితే మూడవ భాగం ఎప్పుడు ఉంటుంది? ఎప్పుడు పట్టాలెక్కుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అసలు ఉందా? లేదా? అన్నది కూడా ఇప్పుడే చెప్పలేం. ఈ విషయం ఇటీవల పుష్ప ఈవెంట్లో బన్నీ మాటల్ని బట్టి క్లారిటీ వచ్చేసింది. పుష్ప3 ప్రకటించాం. కానీ అది ఎప్పుడు ? ఆ భాగం కథ ఏంటి? అన్నది నాకు తెలియదు...ఎదురుగా ఉన్న సుకుమార్ కి తెలియదంటూ ఓపెన్ అయ్యాడు బన్నీ. దీన్ని బట్టి పార్ట్ 3 ఇప్పట్లో సాధ్యమయ్యేది కాదు. 'పుష్ప3' మొదలు పెట్టాలంటే? రెండు భాగాల్నిమించి బలమైన కథ కావాలి. అంది పాన్ ఇండియాని దాటి పాన్ వరల్డ్ నే షేక్ చేసే కంటెంట్ అయి ఉండాలి. ఎర్ర చందనం స్మగ్లింగ్ బిజినెస్ అన్నది విదేశాల్లో ఎలా జరుగు తుందో చూపించాలి. కొత్తగా ఇండియా మార్కెట్ చుట్టూనో .తిరుపతి అడవుల చుట్టూనో చూపిస్తే సరిపోదు. పూర్తి కొత్త కథ, నేపథ్యం కావాలి. అప్పుడే ప్రేక్షకుడికి కొత్త ఫీల్ కలుగుతుంది. కానీ అది ఇప్పట్లో జరిగేది కాదు. ప్రస్తుతం ఎవరి ప్రాజెక్ట్ లతో వారు బిజీగా ఉన్నారు. బన్నీ హీరోగా త్రివిక్రమ్ తో ఓ పాన్ ఇండియా సినిమా తీస్తున్నా డు.అలాగే సుకుమార్..రామ్ చరణ్ తో తెరకెక్కించాల్సిన సినిమాల్లో పనుల్లో తలమునకలై ఉన్నారు. బన్నీ-సుకుమార్ ముందుగా ఈ రెండు సినిమాలు పూర్తి చేసి రిలీజ్ చేయాలి. అందుకు రెండేళ్లు అయినా సమయం పడుతుంది. ఆ తర్వాత కొత్త ప్రాజెక్ట్ గురించి ఆలోచించగలిగేది.





## సూర్యను వెక్కిరించిన కోహ్లీ.. ఈ వీడియో చూస్తే నవ్వాగదు



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ జోక్స్‌కు బాగా ఫేమస్. బ్యాట్ పట్టి గ్రౌండ్‌లోకి దిగితే అగ్రెషన్ మోడ్‌లోకి వెళ్లిపోయే కోహ్లీ.. ఫీల్డింగ్ టైమ్‌లో సహచర ఆటగాళ్లతో సరదాగా ఉంటాడు. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ జోక్స్ వేస్తూ అందర్నీ నవ్వుల్లో ముంచెత్తుతాడు. సీనియర్లు, జూనియర్లు అనే తేడాల్లేకుండా అందరితో స్నేహం చేస్తుంటాడు విరాట్. యంగ్‌స్టర్స్‌తో కలసి అప్పుడప్పుడు అల్లరి చేస్తుంటాడు. జోక్స్ వేస్తూ కడుపుబ్బా నవ్విస్తుంటాడు. ఇమిటేషన్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న కింగ్.. ఈ టాలెంట్‌తో తోటి ప్లేయర్లను వెక్కిరిస్తుంటాడు. తాజాగా అతడు ఇమిటేషన్‌తో మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌ను వెక్కిరించాడు. అసలేం జరిగిందో ఇప్పుడు చూద్దాం..ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో టీమిండియా ఇన్నింగ్స్ సందర్భంగా డగౌట్‌లో కూర్చున్నాడు కోహ్లీ. మ్యాచ్‌లో ఆడని రిషబ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్‌తో కలసి జోక్స్ వేస్తూ నవ్వుల్లో మునిగిపోయాడు. ఇదే తరుణంలో సూర్యకుమార్ యాదవ్‌ను ఇమిటేట్ చేశాడు. గ్రౌండ్‌లోకి దిగితే నోట్లో చూయింగ్ గమ్ వేసుకోవడం సూర్యకు అలవాటు. బ్యాటింగ్, ఫీల్డింగ్ సమయంలో అతడు చూయింగ్ గమ్ నములడం గమనించే ఉంటారు. అదే సీన్‌ను నటించి చూపించాడు కోహ్లీ. నోరును అటూ ఇటూ అంటూ అతడు ఎలా నడుస్తాడో చూపించాడు విరాట్. ఎలా మాట్లాడతాడో కూడా చూపించడంతో అక్కడున్న సహచరులంతా నవ్వుల్లో మునిగిపోయారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, బారామతి వన్డేలో కోహ్లీ నిరాశపర్చాడు. కేవలం 5 పరుగులే చేసి ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు.

## డెబ్యూ మ్యాచ్‌లోనే ఆల్‌టైమ్ రికార్డ్.. ఇతడితో టీమిండియాకు డేంజరే



**న్యూఢిల్లీ-నవభూమి:** డెబ్యూ మ్యాచ్ అంటే ఎంతటి టాలెంటెడ్ ప్లేయర్‌కైనా భయం పట్టుకుంటుంది. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సహజంగానే ఒత్తిడి ఉంటుంది. తప్పక రాణించాలనే ప్రెజర్‌ను తట్టుకొని పెర్ఫార్మ్ చేయడం అంత ఈజీ కాదు. అందునా డెబ్యూ ప్లేయర్ అంటే ఒత్తిడి రెట్టింపుగా ఉంటుంది. ఇవన్నీ తట్టుకొని బెస్ట్ ఇవ్వడం అంత ఈజీ కాదు. కానీ కొందరు అసాధారణ ఆటగాళ్లు ఇవేవీ పట్టించుకోకుండా దుమ్మురేపుతారు. స్టన్నింగ్ పెర్ఫార్మెన్స్‌తో అందర్నీ మెస్మరైజ్ చేస్తారు. సౌతాఫ్రికా కుర్ర ఓపెనర్ మాథ్యూ బ్రీత్‌స్కీ అదే చేసి చూపించాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆల్‌టైమ్ రికార్డు క్రియేట్ చేశాడు. ఆ రికార్డు ఏంటో ఇప్పుడు చూద్దాం..

గుర్తుండిపోయే ఇన్నింగ్స్!..న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో మాథ్యూ బ్రీత్‌స్కీ భారీ సెంచరీతో మెరిశాడు. 148 బంతుల్లో 150 పరుగుల థ్రిల్లింగ్ నాక్‌తో అలరించాడు. 11 బౌండరీలు బాదిన మాథ్యూ బ్రీత్‌స్కీ.. 5 భారీ సిక్సులు కొట్టాడు. సింగిల్స్, డబుల్స్‌తో కివీస్ బౌలర్లను కంగారెత్తించిన సౌతాఫ్రికా చిచ్చరపిడుగు.. అడపాదడపా బిగ్ షాట్స్ ఆడాడు. తన జోన్‌లోకి వచ్చిన ప్రతి బాల్‌ను మైదానం బయటకు పంపించాడు. చూడచక్కటి కవర్ డ్రైవ్స్‌తో పాటు పుల్ షాట్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే అరుదైన ఘనత సాధించాడు మాథ్యూ బ్రీత్‌స్కీ. ఎవరికీ సాధ్యం కాని రికార్డును తన పేరు మీద రాసుకున్నాడు.

## ఒక్కడికే ఆ రూల్ ఎందుకు..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా విజయాల బాటలో పరుగులు పెడుతోంది. మొన్నటికి మొన్న ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1 తేడాతో గెలుచుకున్న మెన్ ఇన్ బ్లూ.. ఇప్పుడు 2-0తో వన్డే సిరీస్‌నూ సొంతం చేసుకుంది. అంతా బాగానే ఉన్నా ఒక ఆటగాడితో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరు మాత్రం విమర్శలకు తావిస్తోంది.టీమిండియా ఇప్పుడు భీకర ఫామ్‌లో ఉంది. ఇటీవల కాలంలో టెస్టుల్లో తడబడుతూ వచ్చిన భారత్.. తనకు అచ్చొచ్చిన వన్డేలు, టీ20ల్లో మాత్రం అదరగొడుతోంది. రీసెంట్‌గా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1 తేడాతో గెలుచుకున్న మెన్ ఇన్ బ్లూ.. ఇప్పుడు జరుగుతున్న వన్డే సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. మరో వన్డే ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. సారథి రోహిత్ శర్మ (90 బంతుల్లో 119) సెంచరీతో చెలరేగడం, మిగతా బ్యాటర్లు ఫామ్ అందుకోవడం, బౌలర్లు అదరగొడుతుండటం భారత్‌కు బిగ్ ప్లస్‌గా మారాయి. కానీ ఒక్కడికి మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అతడే స్టైలిష్ బ్యాటర్, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్.కాన్ఫిడెన్స్ మీదే కొడుతున్నారు!.. కేఎల్ రాహుల్ వన్డే స్పెషలిస్ట్‌గా ముద్రపడిన ప్లేయర్. వికెట్ల వెనుక చురుగ్గా క్యాచులు అందుకోవడం, రనౌట్లు, స్టంపింగ్స్ చేయడంతో పాటు ఇన్నింగ్స్‌ను నిలబెట్టే స్ట్రాంగ్ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. గత రెండేళ్లుగా నంబర్ 5 పొజిషన్‌లో ఆడుతూ దుమ్మురేపాడు. గత 30 ఇన్నింగ్స్‌ల్లో 57 యావరేజ్‌తో 1,259 పరుగులు చేశాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**